


Truth of News
PRGI Reg No: APTEL/26/A4781
# సూర్య వాస్తవం
http://www.suryavastavam.in
చీఫ్ ఎడిటర్ : మొఘల్ ఇర్షాద్ బేగ్

IRS PUBLICATIONS
irspublications12@gmail.com

అన్నమయ్య జిల్లా | సంపుటి: 03 | సంచిక : 20 | శనివారం 29 ఆగస్టు 2026 | పేజీలు : 8 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi

# 579కి చేరిన మృతుల సంఖ్య

- 320 మంది భారతీయుల కోసం కొనసాగుతున్న రెస్క్యూ
- మరోసారి వరద హెచ్చరికలు జారీ
- భయం గుప్పిట్లో ప్రజలు

**కాఠ్మాండు– సూర్య వాస్తవం**

నేపాల్ సరిహద్దు ప్రాంతాల్లో సంభవించిన వినాశకరమైన వరదలు తీవ్ర విషాదాన్ని నింపాయి. వరదల ధాటికి ఇప్పటివరకు 579 మంది ప్రాణాలు కోల్పోగా, చైనా వైపున కూడా ఐదుగురు మరణించారు. రెండు దేశాల సరిహద్దుల్లో కలిపి సుమారు 1,500 మందికి పైగా గల్లంతయ్యారు. గడచిన పదేళ్ల కాలంలో 2015 భూకంపం తర్వాత నేపాల్‌ను ముంచెత్తిన అత్యంత ఘోరమైన విపత్తు ఇదే కావడం గమనార్హం. మంచు కొండలు (గ్లేసియర్) ఉన్నట్టుండి కూలిపోవడంతో ఒక్కసారిగా హిమపాతం ఏర్పడి భీకర వరద ప్రవాహానికి దారితీసిందని భూగర్భ శాస్త్రజ్ఞులు పేర్కొన్నారు. చైనా వైపు ఉన్న డ్యామ్ బద్దలవ్వడంతో నేపాల్ పోలీసులు దిగువ ప్రాంత ప్రజలకు అత్యవసర హెచ్చరికలు జారీ చేశారు. నదీ తీర ప్రాంతాల్లో సహాయక చర్యలు కొనసాగుతున్నప్పటికీ,

- మిగతా 2లో..



# సంయుక్త ప్రకటనపై ఏకాభిప్రాయం

- బ్రిక్స్ కసరత్తు...
మధ్యప్రాచ్య యుద్ధంపై సభ్యదేశాల మధ్య విభేదాలు




**న్యూఢిల్లీ – సూర్య వాస్తవం**

ప్రాదేశిక సమగ్రత, స్వేచ్ఛాయుత సముద్ర వాణిజ్యం, పౌరులు -- పౌర మౌలిక సదుపాయాలకు రక్షణ వంటి అంశాలపై సంయుక్త ప్రకటన కోసం ఏకాభిప్రాయం సాధించే ప్రయత్నంలో భాగంగా భారత్, ఇతర బ్రిక్స్ సభ్యదేశాలు ఎలాంటి అరమరికలు లేకుండా చర్చలు జరుపుతున్నాయని తెలుస్తోంది. వచ్చే నెల 12 -- 13 తేదీలలో న్యూఢిల్లీలో బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశం జరగబోతోంది. ఈ సందర్భంగా విడుదల చేసే సంయుక్త ప్రకటనపై

- మిగతా 2లో..



## మోడీ నివాసంలో రక్షాబంధన్

- ప్రధానికి రాఖీ కట్టిన చిన్నారులు

2

సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

# ఏఐ పేరుతో మోడీ సర్కారు భారీ ఖర్చు!

ఏఐ విప్లవం.. డిజిటల్ ఇండియా.. టెక్నాలజీతో పాలనలో సమూల మార్పులు అంటూ మోడీ ప్రభుత్వం భారీగా ప్రచారం చేసుకుంటోంది. కానీ ఆ ప్రచారానికి ప్రజాధనంతో చెల్లించాల్సిన మొత్తం కూడా భారీగానే కనిపిస్తోంది. కేంద్ర ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ పరిధిలోని నేషనల్ ఈ-గవర్నెన్స్ డివిజన్ (ఎన్ఈజీడీ) ఏఐ, మెషిన్ లెర్నింగ్ నిపుణులను సరఫరా చేసే సంస్థల కోసం నిర్ణయించిన రేట్లు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి.

అత్యున్నత ఏఐ నిపుణుల కోసం నెలకు రూ.4.58 లక్షల వరకు చెల్లించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. 'డిజిటల్ ఇండియా' పేరుతో ప్రచారం ఒకవైపు.. ప్రజాధనంతో భారీ కాంట్రాక్టు వ్యయం మరోవైపు అన్న విమర్శలు ఇప్పుడు వినిపిస్తున్నాయి.

- నిపుణులకు నెలకు రూ.4.58 లక్షల వరకు చెల్లింపు..
- టాప్ సివిల్ సర్వెంట్ల వేతనాల కంటే రెట్టింపు
- ప్రయివేట్ సంస్థలకు రూ.లక్షల్లో ప్రజాధనం
- ప్రభుత్వంలో లేని శాశ్వత నైపుణ్య వ్యవస్థ
- కాంట్రాక్టు నియామకాలతో ఏఐ పాలన ఎంతకాలం : నిపుణులు




**న్యూఢిల్లీ – సూర్య వాస్తవం**

మోడీ ప్రభుత్వం ఏఐని ప్రభుత్వ పాలనలోకి తీసుకొస్తోంది. ఇందుకు భారీ మొత్తంలో వెచ్చించేందుకు సిద్ధమైనట్టు తెలుస్తోంది. అయితే ఇక్కడ అసలు ప్రశ్న.. దానికి ఎంత ఖర్చు? ఎవరి ద్వారా ఖర్చు? ఎంతకాలం కాంట్రాక్టు నిపుణులపై ఆధారపడాలి? అన్నదే. ఎన్ఈజీడీ రూపొందించిన ఏఐ/ఎంఎల్ మానవ వనరుల ఎంపానెల్ రేట్ల ప్రకారం అత్యున్నత స్థాయి నిపుణులకు నెలకు రూ.4,58,500 వరకు చెల్లించాల్సి ఉంటుంది. ఈ మొత్తం నేరుగా ఉద్యోగి జీతం కాదు..

- మిగతా 2లో..



## పెట్టుబడుల ఆకర్షణలో 3వ స్థానంలో రాష్ట్రం

- ముఖ్యమంత్రి డి.కె. శివకుమార్

**బెంగళూరు – సూర్య వాస్తవం**

బెంగళూరు వెలుపల పారిశ్రామిక అభివృద్ధి కోసం ఐదు నగరాలను గుర్తించాలని కర్ణాటక ముఖ్యమంత్రి డి.కె. శివకుమార్ శుక్రవారం అధికారులను ఆదేశించారు.ఆయన తన ఇంటి కార్యాలయంలో జరిగిన వాణిజ్య, పరిశ్రమల శాఖ పురోగతి సమీక్షా సమావేశంలో ప్రసంగించారు. పెట్టుబడిదారులకు ప్రత్యేక ప్రోత్సాహకాలు అందించి, మరిన్ని ఉద్యోగ అవకాశాలు కల్పించడం ద్వారా ఈ నగరాలకు పరిశ్రమలను ఆకర్షించాలని ప్రభుత్వం యోచిస్తోందని సీఎంవో ఒక ప్రకటనలో తెలిపారు. విమానాశ్రయ అనుసంధానం, ఇతర అవసరమైన మౌలిక సదుపాయాలు కలిగిన ఐదు అనువైన నగరాలను గుర్తించాలని శివకుమార్ అధికారులను ఆదేశించారు. పారిశ్రామిక అనుమతుల కోసం సింగిల్-విండో వ్యవస్థను ఏర్పాటు చేసి, దరఖాస్తులను నిర్దేశిత కాలపరిమితిలోగా ప్రాసెస్ చేయాలని ఆయన సంబంధిత శాఖలన్నింటినీ ఆదేశించారు.

తాను ఈ విషయాన్ని సంబంధిత శాఖల మంత్రులతో చర్చిస్తానని

- మిగతా 2లో..

## డబ్బుతో గెలవాలని చూసేవారికి ఓటమి తప్పదు

- టీడీపీ శిక్షణా తరగతుల ట్రైనర్స్‌తో సమావేశమైన ముఖ్యమంత్రి చంద్రబాబు
- 'గొడ్డలి పార్టీ' దుష్ప్రచారాన్ని కార్యకర్తలే తిప్పికొట్టాలని పిలుపు
- రాష్ట్రంలో గత ప్రభుత్వం అన్ని వర్గాలను మోసం చేసిందన్న సీఎం
- స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి విజయమే లక్ష్యంగా పనిచేయాలని దిశానిర్దేశం
- పదవులు తీసుకుని పనిచేయని వారిని తప్పిస్తామని హెచ్చరిక



**అమరావతి– సూర్య వాస్తవం**

మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ముఖ్యమంత్రి చంద్రబాబు పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పార్టీ శిక్షణా తరగతుల ట్రైనర్స్‌తో సమావేశమై వారికి ప్రశంసాపత్రాలు అందించి అభినందించారు. అనంతరం యూనిట్ ఇంఛార్జ్‌లతో 'కాఫీ కబుర్లు' కార్యక్రమంలో పాల్గొని పార్టీ భవిష్యత్ కార్యాచరణపై కీలక దిశానిర్దేశం చేశారు. స్థానిక ఎన్నికలు వస్తున్నాయని, పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఎన్ని ఒడిదొడుకులు ఎదురైనా పార్టీ ముందుకు సాగుతోందంటే

- మిగతా 2లో..



## వివాదం వేళ..సీఎంకు రాఖీ కట్టిన మంత్రి కొండా సురేఖ

- ముఖ్యమంత్రికి మహిళల అండ ఎప్పుడూ ఉంటుందంటూ వ్యాఖ్యలు
- టీపీసీసీ నోటీసుల నేపథ్యంలో ఆసక్తికర చర్చ

**హైదరాబాద్– సూర్య వాస్తవం**

రక్షా బంధన్ సందర్భంగా మంత్రులు కొండా సురేఖ, సీతక్క ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నివాసానికి వెళ్లి రాఖీ కట్టారు. పరకాల వివాదం తర్వాత కొండా సురేఖ.. సీఎం నివాసానికి వెళ్లడం ఇదే తొలిసారి. సీఎంతో భేటీ అనంతరం కొండా సురేఖ మీడియాతో మాట్లాడకుండానే అక్కడి నుంచి వెళ్లి పోయారు.

- మిగతా 2లో..

## సంయుక్త ప్రకటనపై ఏకాభిప్రాయం

(మొదటిపేజీ తరువాయి)

అంగీకారానికి రావడానికి 11 సభ్యదేశాలు సంప్రదింపులు జరుపుతున్నాయి. మధ్యప్రాచ్యంలో అమెరికా -- ఇజ్రాయిల్, ఇరాన్ మధ్య జరుగుతున్న పోరుపై సభ్యదేశాల్లో భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. బ్రిక్స్‌లో ఇరాన్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ సభ్యదేశాలుగా ఉండడమే దీనికి కారణం. అజెండాను, సంయుక్త ప్రకటనను రూపొందించుకోవడం, సభ్యదేశాల మధ్య సమస్యలను పరిష్కరించడం వంటి అంశాలపై శిఖరాగ్ర సమావేశానికి ముందే సంప్రదింపులు జరుగుతున్నాయి. సమావేశానికి ముందు కూడా మరోసారి సభ్యదేశాల మధ్య చర్చ జరుగుతుంది.

**మధ్యవర్తిత్వం కోసం భారత్ ప్రయత్నాలు**

బ్రిక్స్ సమావేశానికి చైనా, రష్యా, ఇరాన్ అధ్యక్షులు హాజరవుతారని తెలుస్తోంది. బ్రిక్స్‌కు అధ్యక్షత వహిస్తున్న భారత్ సభ్యదేశాలతో సంప్రదింపులు జరుపుతూ పారదర్శక మధ్యవర్తిగా వ్యవహరించేందుకు ప్రయత్నిస్తోంది. ఇజ్రాయిల్ -- పాలస్తీనా సంఘర్షణలపై సభ్యదేశాల మధ్య ఏకాభిప్రాయం కుదిరినప్పటికీ మధ్యప్రాచ్య ఘర్షణలపై మాత్రం అది సాధ్యపడడం లేదు. గతంలో జీ -- 20కి అధ్యక్షత వహించినప్పుడు రష్యా -- ఉక్రెయిన్ యుద్ధానికి సంబంధించి అత్యంత క్లిష్టమైన అంశాలపై భారత్ ఏకాభిప్రాయాన్ని సాధించగలిగింది. అయితే ఆ కూటమిలో ఉక్రెయిన్ సభ్యదేశం కాదు. కాగా అమెరికా డాలర్‌కు పోటీగా ప్రత్యేక రిజర్వ్ కరెన్సీని సృష్టించే ప్రతిపాదన ఏదీ పరిశీలనలో లేదని ఓ సీనియర్ అధికారి తెలిపారు. ద్వైపాక్షిక వాణిజ్య లావాదేవీల వ్యయాన్ని తగ్గించేందుకు చేపట్టాల్సిన సాంకేతిక చర్యల పైనే బ్రిక్స్ దేశాలు దృష్టి సారిస్తున్నాయి.

**జరిమానాలు విధిస్తానంటూ ట్రంప్ బెదిరింపు**

బ్రిక్స్ కూటమి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నుంచి విమర్శలను ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే. ఒకవేళ బ్రిక్స్ సభ్యదేశాలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో డాలర్‌కు స్థానం లేకుండా చేసి వేరే కరెన్సీతో వాణిజ్యం చేసేందుకు ప్రయత్నిస్తే జరిమానాలు విధిస్తామని ఆయన హెచ్చరించారు. ప్రస్తుతం బ్రిక్స్‌లో భారత్, బ్రెజిల్, రష్యా, చైనా, దక్షిణాఫ్రికా, ఈజిప్ట్, ఇథియోపియా, యూఏఈ, సౌదీ అరేబియా, ఇరాన్, ఇండోనేషియా సభ్యదేశాలుగా ఉన్నాయి. అయితే తన చేరికను సౌదీ ఇంకా అధికారికంగా అంగీకరించలేదు. న్యూఢిల్లీ సదస్సుకు సౌదీని కూడా ఆహ్వానించారు. సభ్యదేశాలనే కాకుండా ఆఫ్రికన్ యూనియన్, లాటిన్ అమెరికా -- కరేబియన్ దేశాల సమాఖ్య, గల్ఫ్ సహకార మండలికి చెందిన ప్రాంతీయ సంస్థల అధిపతులను కూడా ఆహ్వానించారు.

## వివాదం వేళ..సీఎంకు రాఖీ కట్టిన మంత్రి కొండా సురేఖ

(మొదటిపేజీ తరువాయి)

అనంతరం తన నివాసంలో కొండా సురేఖ మీడియాతో మాట్లాడారు. "సీఎం రేవంత్‌రెడ్డికి మూడోసారి రాఖీ కట్టా. నేను అందరికీ సోదరినే. పండుగ వాతావరణంలో ఎలాంటి రాజకీయ వ్యాఖ్యలు చేయను. ముఖ్యమంత్రికి మహిళల అండ ఎప్పుడూ ఉంటుంది. రాష్ట్రాన్ని అభివృద్ధి చేసే శక్తి ఆయనకు ఇవ్వాలని దేవుడిని కోరుకున్నా. ఆడబిడ్డల ఆశీర్వాదాలు సీఎంకు ఎప్పుడూ ఉండాలని కోరుకున్నా" అని తెలిపారు. ఇటీవల.. ములుగు, పరకాలలో జరిగిన కార్యక్రమంలో సీఎం పాల్గొన్నారు. అయితే ఈ కార్యక్రమాల్లో వరంగల్ జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తోన్న కొండా సురేఖ పాల్గొనలేదు. ముఖ్యమంత్రి పర్యటనలో స్థానిక మంత్రి పాల్గొనకపోవడం చర్చనీయాంశమైంది. పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిని మంత్రి కొండా సురేఖ తీవ్ర స్థాయిలో వ్యతిరేకిస్తున్నారు. తమ వర్గీయులను అణగదొక్కే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపణలు చేశారు. మరోవైపు పరకాల బహిరంగ సభలో పాల్గొన్న ముఖ్యమంత్రి వచ్చే ఎన్నికల్లో రేవూరి ప్రకాశ్‌రెడ్డిని భారీ ఆధిక్యతతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. వచ్చే ఎన్నికల్లో రేవూరే అభ్యర్థి అన్న సంకేతం ఇచ్చినట్లయ్యింది. ఇది జరిగిన మరుసటి రోజే కొండా సురేఖ కుమార్తె పరకాల నియోజకవర్గంలోని గీసుకొండలో సభ ఏర్పాటు చేసి ముఖ్యమంత్రిపైన, స్థానిక ఎమ్మెల్యేపైన తీవ్ర స్థాయిలో ఆరోపణలు చేయడంతో పాటు వచ్చే ఎన్నికల్లో ఇక్కడి నుంచి పోటీ చేస్తానని చెప్పారు. సుస్మిత చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ అధిష్ఠానం కూడా సీరియస్‌గా తీసుకొన్నట్టు సమాచారం. నేరుగా ముఖ్యమంత్రిపై చేసిన విమర్శలు, ఆరోపణలు కాంగ్రెస్‌లో తీవ్ర స్థాయిలో చర్చనీయాంశంగా మారాయి. ఈ వ్యవహారంలో పీసీసీ క్రమశిక్షణా కమిటీ మంత్రి కొండా సురేఖకు నోటీసు ఇవ్వగా, కుమార్తె చేసిన ఆరోపణలకు తానెలా బాధ్యురాలిని అవుతానని సమాధానం ఇచ్చారు. క్రమశిక్షణా రాహిత్యంగా భావించి నోటీసులివ్వడంతోనే పరిమితం కాకుండా చర్యలకు కూడా ఉపక్రమించే అవకాశం ఉన్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఈ క్రమంలో సీఎం నివాసానికి కొండా సురేఖ వెళ్లడం చర్చనీయాంశంగా మారింది.

## డబ్బుతో గెలవాలని చూసేవారికి ఓటమి తప్పదు

(మొదటిపేజీ తరువాయి)

కార్యకర్తల బలమే కారణమని చంద్రబాబు ప్రశంసించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి విజయదుందుభి మోగించాలని ఆకాంక్షించారు. రాష్ట్ర స్థాయి నుంచి క్షేత్రస్థాయి వరకు కూటమి నేతలు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేయాలని, కూటమి అధికారంలో ఉంటేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని స్పష్టం చేశారు. ప్రజలతో సత్సంబంధాలు ఉన్నవారే ఎన్నికల్లో గెలుస్తారని, డబ్బుతో గెలవాలని చూసేవారికి ఓటమి తప్పదని హితవు పలికారు.

పార్టీకి శిక్షణ ఇవ్వడం అనేది అత్యంత కీలకమైన కార్యక్రమమని ముఖ్యమంత్రి తెలిపారు. పార్టీ విలువలు, సిద్ధాంతాలను నూతన నాయకత్వానికి అందించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని స్పష్టం చేశారు. క్షేత్రస్థాయి అనుభవం, పార్టీ భావజాలంపై పూర్తి అవగాహన ఉన్నవారితోనే శిక్షణ ఇప్పిస్తున్నామని, దీనివల్ల సిద్ధాంతాలు క్షేత్రస్థాయిలోకి వెళుతున్నాయని వివరించారు. నేతలు, కార్యకర్తలు ఎప్పటికప్పుడు సమకాలీన అంశాలపై అధ్యయనం చేస్తూ, ప్రజలతో మమేకమవ్వాలని సూచించారు. సొంతంగా పత్రిక, ఛానల్ పెట్టుకుని దుష్ప్రచారాలు చేస్తున్న 'గొడ్డలి పార్టీ' విధానాలను కార్యకర్తలే తిప్పికొట్టాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. మీడియాను అడ్డం పెట్టుకుని చేస్తున్న అసత్య ప్రచారాలను వాస్తవాలతో ప్రజలకు వివరించాలని కోరారు. గొడ్డలి పార్టీగా తాను అభివర్ణించిన పార్టీ అధ్యక్షుడి వల్లే రాష్ట్రంలో అధికారులు, పారిశ్రామికవేత్తలు జైళ్లకు వెళ్లారని, దేశ రాజకీయ చరిత్రలోనే ఒక నాయకుడి వల్ల ఇలా జరగడం ఇదే ప్రథమమని తీవ్రంగా విమర్శించారు. రాజకీయాలను అడ్డం పెట్టుకుని పారిశ్రామికవేత్తలను బెదిరించి, సొంత కంపెనీలలో పెట్టుబడులు పెట్టించారని ఆరోపించారు. నేరాలు చేయించి, వాటిని అలవాటుగా మార్చి, ఆ నేరాలే మెడకు చుట్టుకుంటాయనే సమయంలో వారిని అంతం చేయడమే ఆ పార్టీ విధానమని, ఇలాంటి వారి వ్యక్తిత్వాలను ప్రజల్లోకి తీసుకెళ్లి చైతన్యం చేయాలని సూచించారు. గత ప్రభుత్వం మద్యపాన నిషేధం, సీపీఎస్ రద్దు, జాబ్ క్యాలెండర్ వంటి హామీలతో ప్రజలను మోసం చేసిందని, 2019-24 మధ్య కాలంలో ఏకంగా 9 సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచి ప్రజలపై తీవ్ర భారం మోపిందని గుర్తు చేశారు. కార్యకర్తల సంక్షేమం గురించి ఆలోచించే ఏకైక పార్టీ టీడీపీ అని, పదవులు తీసుకుని పనిచేయని వారి స్థానంలో కొత్తవారికి అవకాశం కల్పిస్తామని ఆయన స్పష్టం చేశారు.

# ఏఐ పేరుతో మోడీ సర్కారు భారీ ఖర్చు!

(మొదటిపేజీ తరువాయి)

నిపుణుడిని అందించే సంస్థకు ప్రభుత్వం చెల్లించే రేటు. అందులో సంస్థ ఖర్చులు, మార్జిన్ కూడా ఉంటాయి. అయినప్పటికీ ప్రభుత్వ ఖజానాపై పడే భారాన్ని మాత్రం విస్మరించలేమని విశ్లేషకులు చెప్తున్నారు.?క్యాబినెట్ కార్యదర్శి కంటే ?ఏఐ నిపుణుడి రేటు ఎక్కువ!కేంద్ర ప్రభుత్వ క్యాబినెట్ కార్యదర్శి ప్రాథమిక వేతనం నెలకు రూ.2.50 లక్షలు. ప్రభుత్వ కార్యదర్శి ప్రాథమిక వేతనం రూ.2.25 లక్షలు. అదే సమయంలో ఏఐ సొల్యూషన్ ఆర్కిటెక్ట్, డేటా సైన్స్ లీడ్, ఏఐ/ఎంఎల్ లీడ్ కోసం నెలకు రూ.4,58,500 వరకు రేటు నిర్ణయించారు. అంటే రేటు పరంగా చూస్తే.. దేశ అత్యున్నత సివిల్ సర్వీసు స్థాయి అధికారుల ప్రాథమిక వేతనాల కంటే దాదాపు రెట్టింపు.

అయితే ఇక్కడ ఒక విషయాన్ని స్పష్టంగా చెప్పాలి. ఇది ఏఐ నిపుణుడి చేతికి వెళ్లే జీతం కాదు. ఏజెన్సీకి ప్రభుత్వం చెల్లించే మొత్తం. అందులో ఏజెన్సీ నిర్వహణ ఖర్చులు, మార్జిన్ కూడా ఉంటాయి. అయినా.. ఒక్కో నిపుణుడి సేవకు ప్రభుత్వ ఖజానా నుంచి లక్షల రూపాయలు వెచ్చించాల్సిన స్థాయికి వ్యవస్థ చేరడం గమనార్హం.'డిజిటల్ ఇండియా'కు కాంట్రాక్టు మోడల్!మోడీ ప్రభుత్వం డిజిటల్ ఇండియాను తమ విజయంగా తీవ్ర ప్రచారం చేస్తోంది. ఇప్పుడు అదే డిజిటల్ వ్యవస్థను నడిపించేందుకు ప్రయివేట్ ఏజెన్సీల నుంచి నిపుణులను తీసుకుంటోంది. ఎన్ఈజీడీ అధికారిక టెండర్ ప్రకారం.. ఏఐ/ఎంఎల్ నిపుణులను అందించే భాగస్వామ్య సంస్థలను ఎంపిక చేయడం, ప్రభుత్వ విభాగాలకు అవసరమైన సాంకేతిక నైపుణ్యాన్ని వేగంగా అందించడం ఈ వ్యవస్థ ఉద్దేశం. అంటే 'స్వయం సమృద్ధి' అంటూ ప్రచారం చేసే కేంద్ర ప్రభుత్వం.. కీలకమైన కొత్త సాంకేతిక నైపుణ్యాల కోసం మాత్రం బయటి సంస్థలపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడిందా? అన్న ప్రశ్న తలెత్తుతోంది.?ప్రభుత్వ ఫైళ్లపై ఏ'ఐ'!ఏఐ నిపుణులతో చేయించబోయే పనులు చిన్నవి కావు. క్యాబినెట్ నోట్లు, టెండర్ పత్రాలు, పాలసీ డాక్యుమెంట్లను సంక్షిప్తం చేసే సాఫ్ట్‌వేర్.. ఉమంగ్, డీజీలాకర్ వంటి ప్రభుత్వ యాప్‌లలో చాట్‌బాట్లు.. ప్రాంతీయ భాషల్లో వాయిస్ ఆధారిత సేవలు.. సర్టిఫికెట్లు, ఐడీలు, స్కాన్ చేసిన పత్రాల నుంచి డేటా సేకరణ..ముఖ గుర్తింపు ఆధారిత హాజరు, డిజిటల్ ఆన్‌బోర్డింగ్.. ఇలా ఇవన్నీ ప్రతిపాదనలో ఉన్నాయి. ఇలా అత్యంత సున్నితమైన డేటాతో వ్యవహరించే వ్యవస్థలను ప్రయివేట్ ఏజెన్సీల ద్వారా నిర్మిస్తున్నప్పుడు.. డేటా భద్రత, గోప్యత, బాధ్యత ఎవరిది? అన్నది ప్రశ్నార్థకంగా మారింది.ప్రభుత్వ ఏజెన్సీలు వెతకడం

**'ఏఐ భారత్' కాదు.. 'కాంట్రాక్ట్ భారత్'!**

టెక్నాలజీని ప్రభుత్వంలోకి తీసుకురావడాన్ని ఎవరూ వ్యతిరేకించరు. కానీ సాంకేతికత పేరుతో ప్రజాధనం ఖర్చు చేస్తున్నప్పుడు దానికి సమానమైన జవాబుదారీతనం కూడా ఉండాలి. ప్రభుత్వంలోనే శాశ్వత ఏఐ నైపుణ్యాన్ని పెంచకుండా.. కాంట్రాక్టు మోడల్‌పై ఆధారపడటం దీర్ఘకాలిక పరిష్కారమా? డేటా భద్రతకు బాధ్య ఎవరిది? అనే ప్రశ్నలు అందరిలోనూ మెదులుతున్నాయి.

**ఏఐకి లక్షలు.. పాలనకు ప్రశ్నలు!**

దేశంలో ఏఐ నైపుణ్యాలకు డిమాండ్ పెరిగింది. ప్రభుత్వం కూడా ప్రతిభను ఆకర్షించేందుకు పోటీ పడుతోంది. కానీ మోడీ ప్రభుత్వం 'మినిమమ్ గవర్నమెంట్, మ్యాక్సిమమ్ గవర్నెన్స్' అంటూ ప్రచారం చేసిన నేపథ్యంలో ఇప్పుడు మరో ప్రశ్న ఎదురవుతోంది. ప్రభుత్వానికి శాశ్వతంగా అవసరమైన సాంకేతిక నైపుణ్యాలను ప్రభుత్వ వ్యవస్థలోనే ఎందుకు పెంచకూడదు? ప్రతిసారి ప్రయివేటు ఏజెన్సీల ద్వారా నిపుణులను తీసుకోవాల్సిందేనా? ప్రజాధనంతో చెల్లించే ఈ భారీ రేట్లకు ఫలితాలను కొలిచే పారదర్శక వ్యవస్థ ఉందా? ఇవే అసలు ప్రశ్నలు.

# 579కి చేరిన మృతుల సంఖ్య

(మొదటిపేజీ తరువాయి)

శిథిలాలు పేరుకుపోవడం వల్ల సహాయక బృందాలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ విపత్తులో చిక్కుకున్న భారతీయ పౌరుల భద్రతపై భారత ప్రభుత్వం దృష్టి సారించింది. విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ అందించిన వివరాల ప్రకారం.. వరద ప్రభావిత ప్రాంతాల్లో చిక్కుకున్న 21 మంది భారతీయులను కాట్మాండు నుంచి సురక్షితంగా ఢిల్లీకి తరలించారు.

అంతేకాకుండా, త్రిశూలి హైడ్రోపవర్ ప్రాజెక్టులో పనిచేస్తున్న 63 మంది భారతీయ కార్మికులను భద్రతా బలగాలు కాపాడాయి. చైనా సరిహద్దు ప్రాంతంలో చిక్కుకున్న మరో 96 మంది భారతీయులు కూడా నేపాల్‌కు సురక్షితంగా చేరుకున్నారు. అయితే, ఇప్పటికీ 320 మంది భారత పౌరులతో పాటు 100 మంది భారత సంతతి వ్యక్తుల ఆచూకీ లభించాల్సి ఉంది. మరో 400 మంది చైనా వైపు చిక్కుకుపోయారని ఎంఈఏ శుక్రవారం తెలిపింది.వారితో సంబంధాలు పునరుద్ధరించేందుకు ముమ్మర ప్రయత్నాలు జరుగుతున్నాయని విదేశాంగ శాఖ స్పష్టం చేసింది.

**మరోసారి వరద హెచ్చరికలు..**

నేపాల్లో ఇప్పుడిప్పుడే ఊపిరి పీల్చుకుంటున్న వరద బాధితులకు మళ్లీ ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. చైనా వైపు కొండచరియలు, శిథిలాలు అడ్డుపడటం వల్ల ఏర్పడిన కృత్రిమ సరస్సు ఏ క్షణమైనా బద్దలయ్యే ప్రమాదం ఉందని అధికారుల నుంచి హెచ్చరికలు వచ్చాయి. దీనివల్ల దిగువన ఉన్న నేపాల్‌లోని బోటేకోషి, త్రిశూలి నదీ ప్రాంతాలకు మరోసారి భారీగా వరద నీరు వచ్చి చేరే అవకాశం ఉందంటున్నారు. ప్రమాదాన్ని పసిగట్టిన అధికారులు నదీ తీరాల్లోని ప్రజలను వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలిపోవాలని ఆదేశించారు. శిథిలాలు, వరద నీరు ఒకేసారి విరుచుకుపడే అవకాశం ఉండటంతో భద్రతా బలగాలు సహాయక చర్యలను మరింత అప్రమత్తంగా కొనసాగిస్తున్నాయి. నదీ పరివాహక ప్రాంతాల్లో నివసించే ప్రజలు అత్యంత జాగ్రత్తగా ఉండాలని పోలీసులు మైకుల ద్వారా హెచ్చరిస్తున్నారు.

**భారత్ బాసట..**

నేపాల్‌లో సంభవించిన విపత్తులో భారత్ మరోసారి తన ఉదారతను చాటుకుంటోంది. ప్రమాదం జరిగిన వెంటనే స్పందించి బాధితులకు సహాయం అందించడంలో భారత్ 'ఫస్ట్ రెస్పాండర్'గా నిలిచింది. చైనా, అమెరికా వంటి దేశాలు ఇంకా సహాయ చర్యలను సిద్ధం చేస్తున్న సమయంలోనే న్యూఢిల్లీ వేగంగా స్పందించింది. ఆహారం, ఔషధాలతో కూడిన సహాయక సామగ్రిని ప్రత్యేక విమానంలో నేపాల్ తరలించింది. గతంలో కోవిడ్ టీకాల పంపిణీతో పాటు టర్కీ, మయన్మార్, శ్రీలంక, వెనిజులా దేశాల్లో విపత్తులు వచ్చినప్పుడు భారత్ ఇలాగే తక్షణమే స్పందించింది. బుధవారం సాయంత్రం భారత ప్రధాని నరేంద్ర మోదీ నేపాల్ ప్రధాని బాలేంద్ర షాతో ఫోన్లో మాట్లాడారు. ఈ ఘోర ప్రమాదంపై తీవ్ర సంతాపం తెలిపారు. నేపాల్‌కు అవసరమైన అన్ని రకాల మానవీయ సహాయాన్ని అందించడానికి భారత్ సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు.

విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ కూడా స్పందిస్తూ.. భారత్ ఎల్లప్పుడూ నేపాల్ ప్రజలకు అండగా ఉంటుందని ప్రకటించారు. భారత్ శుక్రవారం మధ్యాహ్నం నాటికి మొత్తం 62 టన్నుల సహాయక సామగ్రిని నేపాల్‌కు చేరవేసింది. ఇందులో అత్యవసర మందులు, ఆహార పొట్లాలు ఉన్నాయి. ఇతర దేశాలు సహాయం ప్రకటించే లోపే భారత్ క్షేత్రస్థాయికి సహాయక సామగ్రిని పంపించి తన వేగాన్ని నిరూపించుకుంది. చైనా, దక్షిణ కొరియా, బ్రిటన్, అమెరికా, ఐక్యరాజ్యసమితి, ప్రపంచ బ్యాంక్ కూడా సహాయం అందిస్తామని ప్రకటించాయి. కానీ భారత్ అందించిన వేగవంతమైన సహాయం అందరి దృష్టిని ఆకర్షించింది.

## పెట్టుబడుల ఆకర్షణలో 3వ స్థానంలో రాష్ట్రం

(మొదటిపేజీ తరువాయి)

ఆయన అన్నారు. "ఈ వ్యవస్థ కింద, 22 శాఖలు మరియు 119 సేవలకు డిజిటల్ మరియు సకాల ఆమోదాలపై ప్రాధాన్యత ఇవ్వబడింది. నీతి ఆయోగ్ యొక్క పెట్టుబడిదారులకు అనుకూలమైన సూచికలో కర్ణాటక 9వ స్థానంలో ఉంది. ఈ ర్యాంకింగ్‌ను మరింత మెరుగుపరచడానికి చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. పెట్టుబడులను ఆకర్షించడానికి ఆంధ్రప్రదేశ్, ఉత్తరప్రదేశ్, తమిళనాడు మరియు మధ్యప్రదేశ్ వంటి రాష్ట్రాలు తీసుకుంటున్న చర్యలపై చర్చించారు. రాష్ట్రం నుండి పెట్టుబడిదారులు ఆశించే సంస్కరణల గురించి కూడా ఈ సమావేశంలో చర్చించారు. గత మూడేళ్లలో తయారీ రంగంలో రూ. 5.58 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించడంలో కర్ణాటక మూడవ స్థానంలో నిలిచిందని అధికారులు తెలిపారు. సెమీకండక్టర్లు, ఏరోస్పేస్ మరియు రక్షణ, క్లీన్ మొబిలిటీ, సెల్ తయారీ మరియు ఇతర అభివృద్ధి చెందుతున్న రంగాలలో పెట్టుబడులకు ప్రత్యేక ప్రోత్సాహకాలు ఇస్తున్నట్లు వారు పేర్కొన్నారు. 'ఉత్పత్తి మంథన్' పేరుతో 80 మంది సీఈఓలతో సంప్రదింపుల సమావేశం జరిగింది. అందిన 55 సూచనలలో 35 సూచనలను ఇప్పటికే పరిష్కరించినట్లు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## ఈనెల 30న నీట్--పీజీ పరీక్ష...!

- పకడ్బందీగా అన్ని ఏర్పాట్లు చేపట్టాలి
- ఉదయం 7 గంటల నుంచే అభ్యర్థులకు అనుమతి
- ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు పరీక్ష
- సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారంపై కఠిన చర్యలు
- డీఆర్వో ఏ.మలోల




**అనంతపురం విద్య - సూర్య వాస్తవం** : ఈనెల 30న నిర్వహించనున్న నీట్--పీజీ పరీక్షకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలని డీఆర్వో ఏ. మలోల సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం అనంతపురం కలెక్టరేట్ నుంచి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పరీక్ష ఏర్పాట్లపై సమీక్షించారు.ఆగస్టు 30న ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్ష జరుగుతుందని తెలిపారు. అభ్యర్థులను ఉదయం 7 గంటల నుంచే పరీక్ష కేంద్రాల్లోకి అనుమతిస్తామని పేర్కొన్నారు. జిల్లాలోని ఐదు కేంద్రాల్లో మొత్తం 979 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నట్లు వెల్లడించారు.బుక్కరాయసముద్రం మండలం రోటరీపురంలోని శ్రీనివాస రామానుజన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, ఎస్కేయూ సమీపంలోని ఇటుకలపల్లిలో అనంతలక్ష్మి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్, రాప్తాడు మండలం చిన్మయి నగర్‌లోని నేషనల్ కౌన్సిల్ ఫర్ ద చర్చ్ సోషల్ యాక్షన్ ఇండియా, తాడిపత్రి మండలం వీరాపురం వద్దనున్న తాడిపత్రి ఇంజనీరింగ్ కాలేజ్, అనంతపురం రోడ్డులోని సీవీ రామన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్ కళాశాలల్లో పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు.

అన్ని కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలని, పరీక్ష కేంద్రాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. పటిష్టమైన పోలీసు బందోబస్తు, మెడికల్ టీంలు, ఫస్ట్ ఎయిడ్ సౌకర్యాలు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. అభ్యర్థుల సౌకర్యార్థం ఏపీఎస్ఆర్టీసీ ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయాలని సూచించారు. పరీక్ష కేంద్రాల పరిధిలోని జిరాక్స్ కేంద్రాలను మూసివేయాలని, పరీక్ష రోజున అభ్యర్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసి ఎలక్ట్రానిక్ పరికరాలను కేంద్రాల్లోకి అనుమతించకూడదని స్పష్టం చేశారు. పరీక్షకు సంబంధించి సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీఆర్వో హెచ్చరించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ ఏవో అలెగ్జాండర్ తదితరులు పాల్గొన్నారు.

# సీఎం పర్యటనకు పటిష్ట బందోబస్తు...!

## - భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ, కలెక్టర్
## - కాన్వాయ్ రూట్, హెలిప్యాడ్ వద్ద పటిష్ట బందోబస్తు





**అనంతపురం క్రైమ్ - సూర్య వాస్తవం :** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈనెల 30న అనంతపురం జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా ఎస్పీ పి. జగదీష్ పోలీసు అధికారులను ఆదేశించారు. సీఎం పర్యటించే మార్గాలు, కార్యక్రమ ప్రాంగణాల్లో ఎలాంటి భద్రతా లోపాలకు తావులేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. శుక్రవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ గారితో కలిసి ఎస్పీ అనంతపురం నగరంలోని శిల్పారామం, బళ్లారి రోడ్డులోని ఎంవైఆర్ కళ్యాణ మండపం, హెలిప్యాడ్ ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సీఎం కాన్వాయ్ రూట్, హెలిప్యాడ్ భద్రత, వీఐపీ పార్కింగ్ తదితర ఏర్పాట్లను సమీక్షించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటించే ప్రతి ప్రాంతంలో కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని, సీనియర్ పోలీసు అధికారుల పర్యవేక్షణలో భద్రతా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. హెలిప్యాడ్ పరిసరాలు, సభా వేదిక వద్ద బ్యారికేడింగ్‌ను పటిష్టం చేయడంతో పాటు బాంబ్, డాగ్ స్క్వాడ్‌లతో ముమ్మర తనిఖీలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమాల్లో చిన్నపాటి భద్రతా లోపానికి కూడా అవకాశం లేకుండా పోలీసులు పూర్తి అప్రమత్తతతో విధులు నిర్వహించాలని ఎస్పీ స్పష్టం చేశారు. సీఎం పర్యటనకు సంబంధించిన అన్ని భద్రతా ఏర్పాట్లను సమన్వయంతో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ తనిఖీల్లో అసిస్టెంట్ కలెక్టర్ సుయాశ్ కుమార్, పలువురు డీఎస్పీలు, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# కోట్ల నాయకత్వంపై విశ్వాసంతో టీడీపీలోకి 30 కుటుంబాల చేరిక....!!



**డోన్ -సూర్య వాస్తవం :** డోన్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో డోన్ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి గారి ఆధ్వర్యంలో ప్యాపిలి మండలంలో భారీగా పార్టీ చేరికలు జరిగాయి. ప్యాపిలి మండలంలోని కల్చట్ల గ్రామానికి చెందిన ఎంపీటీసీ శ్రీమతి సరస్వతమ్మ, జయరామయ్యలతో పాటు దాదాపు 25 కుటుంబాలు, అలాగే పెద్దపొద్దిల గ్రామానికి చెందిన 5 కుటుంబాలు వైఎస్సార్‌సీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొత్తగా పార్టీలో చేరిన వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన కుటుంబాలకు పూర్తి స్థాయిలో అండగా ఉంటామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు మరియు డోన్ నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనుల పట్ల ప్రజలు విశ్వాసం వ్యక్తం చేస్తున్నందునే పెద్ద ఎత్తున తెలుగుదేశం పార్టీలో చేరుతున్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను మరింత వేగవంతంగా ముందుకు తీసుకెళ్తామనీ ఎమ్మెల్యే తెలిపారు. కోట్ల కుటుంబం నాయకత్వంలో డోన్ నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ మరింత బలోపేతం అవుతోందని, రానున్న రోజుల్లో మరిన్ని కుటుంబాలు పార్టీలో చేరనున్నాయని నాయకులు అభిప్రాయపడ్డారు.

# చెన్నకేశవ స్వామి ఆలయ నిర్మాణానికి రూ.10,000 విరాళం



**పామిడి- సూర్య వాస్తవం:** మండల కేంద్రమైన పామిడి పట్టణంలోని ప్రసిద్ధి చెందిన పురాతన చెన్నకేశవ స్వామి దేవాలయం శిథిలావస్థకు చేరుకోవడంతో పునర్నిర్మాణం కొరకు 7వ. వార్డ్ మాజీ కౌన్సిలర్ వై,యు.రామాంజనేయులు కొడుకు చరణ్,10,000 రూపాయలను విరాళముగా ఆలయ ప్రధాన పురోహితులు పురుషోత్తం, కీ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భగవంతుడు లేనిది మానవుడు లేడని అలాంటి దేవుని ఆలయానికి నా యొక్క చిన్నపాటి విరాళం అందజేశానని, ఆలయ నిర్మాణం పూర్తి అయితే చిదస్మరణీయమైన, శాశ్వతమైన కానుకను అందజేస్తారని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వై యు రామాంజనేయులు,చరణ్,పురోహితుడు పురుషోత్తము కమిటీ సభ్యులు రాము, వెంకట రమణ, సుబ్బు, మోహన్ బాబు తదితరులు పాల్గొన్నారు.




# సర్వజన ఆసుపత్రిలో నిండా నిర్లక్ష్యమే..!

- రక్త నమూనా సేకరించి.. సిరంజి అక్కడే వదిలేశారంటూ ఆరోపణలు
- పరీక్ష ఏంటి..? నమూనా ఎక్కడికి..? సమాచారం కరవు
- గత ఫిర్యాదులున్నా మారని సిబ్బంది
- అధికారుల పర్యవేక్షణ లోపం
- అంబులెన్సుల వ్యవహారంపైనా ఆరోపణలు..
- జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకోవాలని కోరుతున్న జిల్లా ప్రజలు

అనంతపురంలోని పేదల పెద్దాసుపత్రి పరిస్థితి అధ్వానంగా మారింది. పాలకులు, పాలనాధికారులు పట్టింపులేక నిర్వహణ అస్తవ్యస్తంగా ఉంది. మొన్నటి అంబులెన్సు....ఘటన తర్వాత తీరు మారకపోగా నిండా నిర్లక్ష్యమే కనిపిస్తోంది.
ఆసుపత్రి కి చికిత్స కోసం వచ్చే రోగుల నుంచి రక్త నమూనాలను సేకరిస్తున్నప్పటికీ ఆ నమూనాలు ఎక్కడికి వెళు_న్నాయి? ల్యాబ్లో పరీక్షలు జరుగుతున్నాయ..? నివేదికలు ఎందుకు అందడం లేదు? అనే అంశాలపై స్పష్టత లేకపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వ ఆస్పత్రిపై ఆధారపడే పేద, మధ్య తరగతి ప్రజలు రోజూ వందల సంఖ్యలో వైద్య సేవల కోసం వస్తుంటారు. వైద్యుల సూచన మేరకు రక్త పరీక్షలు అవసరమని చెప్పడంతో రోగుల నుంచి నమూనాలను సేకరిస్తున్నారు.
అయితే పరీక్షలు పూర్తయ్యాక నివేదికలు అందవలసిన సమయంలో మాత్రం రోగులు తీవ్ర అయోమయానికి గురవుతున్నారు.

**అనంతపురం వైద్యం - సూర్య వాస్తవం :** అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సిబ్బంది నిర్లక్ష్యానికి సంబంధించిన మరో ఘటన వెలుగులోకి వచ్చింది. వెంకటాద్రి నాయుడు అనే పేషెంట్ నుంచి గురువారం ఉదయం రక్త పరీక్షల నిమిత్తం నమూనా సేకరించిన అనంతరం.. రక్తంతో ఉన్న సిరంజిని అక్కడే వదిలేసి సిబ్బంది వెళ్లిపోయారని పేషెంట్ కుటుంబ సభ్యులు ఆరోపించారు. రక్తంతో ఉన్న సిరంజి అక్కడే ఉండటాన్ని గమనించిన పేషెంట్ తల్లి.. దానిని భద్రంగా ఒక కవర్లో పెట్టుకున్నట్లు తెలిపారు. అయితే రక్త నమూనాను ఎందుకు సేకరించారు? ఎవరు తీసుకున్నారు? ఏ పరీక్ష కోసం తీసుకున్నారు? అనే విషయాలపై తమకు స్పష్టమైన సమాచారం ఇవ్వలేదని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. ఈ విషయంపై అక్కడి నర్సులను కుటుంబ సభ్యులు ప్రశ్నించగా.. "ఈరోజు కాకపోతే ఇప్పుడైనా ల్యాబ్‌కు ఇవ్వొచ్చు.. లేదంటే రేపు వచ్చి తీసుకుంటారు.. అది పడేయండి" అంటూ సమాధానం ఇచ్చినట్లు వారు ఆరోపించారు.






### నమూనాల నిర్వహణపై అనుమానాలు

రక్త నమూనాలను సేకరించిన అనంతరం వాటిని నిబంధనల ప్రకారం గుర్తింపు వివరాలతో లేబుల్ చేసి, సంబంధిత ల్యాబొరేటరీకి సక్రమంగా తరలించాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియలో నిర్లక్ష్యం జరిగిందన్న ఆరోపణలు రావడంతో పేషెంట్ కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రక్త నమూనా ఏ పరీక్షకు సంబంధించినది? దానిని సక్రమంగా ల్యాబ్‌కు పంపించారా? లేక నిర్లక్ష్యంగా వదిలేశారా? అనే అంశాలపై ఆసుపత్రి అధికారులు స్పష్టత ఇవ్వాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

### సమస్యలపై ఫిర్యాదులు.. చర్యలు ఎక్కడ?

అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రిలో వీల్‌చైర్లు, స్ట్రెచర్లు అందుబాటులో లేకపోవడం, సిబ్బంది పనితీరుపై గతంలోనూ రోగుల బంధువులు ఫిర్యాదులు చేసినప్పటికీ.. సమస్యల పరిష్కారంపై తగిన స్థాయిలో స్పందన కనిపించడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. అదేవిధంగా ఆసుపత్రి వెలుపల అంబులెన్సుల వ్యవహారంపై కూడా పలు ఆరోపణలు వినిపిస్తున్నాయని, వాటిపై సంబంధిత అధికారులు దృష్టి సారించి తగిన చర్యలు తీసుకోవాలని రోగుల బంధువులు కోరుతున్నారు.

### కలెక్టర్ జోక్యం చేసుకోవాలి....జిల్లా ప్రజలు...

ప్రభుత్వ ఆసుపత్రిలో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా జిల్లా కలెక్టర్, వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు. రక్త నమూనా ఘటనపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను నిర్ధారించాలని, నిర్లక్ష్యం రుజువైతే బాధ్యులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని జిల్లా వాసులు డిమాండ్ చేస్తున్నారు. అదేవిధంగా ఆసుపత్రిలో సిబ్బంది పనితీరుపై నిరంతర పర్యవేక్షణ చేపట్టి, రోగులకు మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సామాన్య ప్రజలు కోరుతున్నారు.

### కలెక్టర్ గారూ జర అంబులెన్సు దందా వైపు చూదరూ

ప్రభుత్వ ఆసుపత్రి గేటు బయట అంబులెన్స్ డ్రైవర్స్ ఒక యూనియన్ గా మారి అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రి నుంచి పేషెంట్లను బెంగళూరు తీసుకెళ్లడానికి దాదాపు పదివేల రూపాయల వరకు తీసుకుంటున్నారు అదే ప్రైవేట్ హాస్పిటల్ దగ్గర 6000 వరకు తీసుకుంటున్నారు ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే నిరుపేదల రక్తం పిలుస్తున్న ఏ అంబు లెన్స్ యూనియన్ మీద గాని కలెక్టర్ ఉన్నతాధికారులు పర్యవేక్షవలసిందిగా జిల్లా ప్రజలు కోరుకుంటున్నారు.

# జెడ్పీహెచ్ఎస్‌కు 'స్కూల్ ఆఫ్ స్పోర్ట్స్ ఎక్సలెన్స్' అవార్డు



**చెన్నూరు-సూర్య వాస్తవం:** హాకీ మాంత్రికుడు, భారత క్రీడా దిగ్గజం మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని ఏటా ఆగస్టు 29న నిర్వహించే జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అందజేస్తున్న లి'స్కూల్ ఆఫ్ స్పోర్ట్స్ ఎక్సలెన్స్ అవార్డ్స్--2026'లికు వైఎస్సార్ కడప జిల్లాలోని చెన్నూరు మండలం రామనపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎంపికైంది. క్రీడల్లో విద్యార్థులను ప్రోత్సహించడంతో పాటు పాఠశాల స్థాయిలో సాధించిన క్రీడా ప్రతిభను గుర్తిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి జిల్లాలోని ఐదు పాఠశాలలను ఎంపిక చేస్తోంది. ఎస్‌జీఎఫ్‌లో పాఠశాల సాధించిన పాయింట్ల ఆధారంగా ఈ పాఠశాలలను ఎంపిక చేసి క్రీడా ప్రతిభ పురస్కారాలతో సన్మానించనున్నారు. ఈ క్రమంలో జెడ్పీహెచ్ఎస్ రామనపల్లి పాఠశాల 211 పాయింట్లు సాధించి వైఎస్సార్ కడప జిల్లా నుంచి అవార్డుకు ఎంపికైంది. పాఠశాల విద్యార్థులు వివిధ క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచి సాధించిన పాయింట్లతో ఈ గుర్తింపు లభించింది. పాఠశాల క్రీడా విభాగం పీడీ పీ. గణేష్‌బాబు ఆధ్వర్యంలో విద్యార్థులకు నిరంతరం శిక్షణ అందిస్తూ క్రీడల్లో రాణించేలా ప్రోత్సహిస్తున్నారు. అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమం ఆగస్టు 29న సాయంత్రం 3 గంటలకు కడప లోని డీఈఓ కార్యాలయ మీటింగ్ హాల్‌లో నిర్వ హించ నున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రతినిధులకు క్రీడా ప్రతిభ పురస్కారాన్ని అందజేయను న్నారు. పాఠశాలకు ప్రతిష్టాత్మకమైన అవార్డు లభించడం పట్ల ప్రధానోపాధ్యాయురాలు పి. ఉమామహేశ్వరి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్తులోనూ విద్యతో పాటు క్రీడల్లో విద్యార్థులు మరింత ఉన్నత స్థాయికి ఎదిగేలా కృషి చేస్తామని ప్రధానోపాధ్యాయురాలు తెలిపారు.



Truth of News
సూర్య వాస్తవం
http://www.suryavastavam.in



## బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన



**గుత్తి - సూర్య వాస్తవం :** గుత్తి మండలం రాజాపురం గ్రామా దగ్గర వున్న సాంఘిక సంక్షేమ గు రుకుల బాలికల పాఠశాలలో లింగ వివక్షత మరియు బాల్యవివాహా ల నిరోధక చట్టంపై అవగాహన కార్య క్రమం నిర్వహించారు.ఈ సందర్భం గా వైద్యాధికారి డాక్టర్ కే.ప్రవీణ్ కు మార్ మాట్లాడుతూ నేటి ఆడ కూ తురు రేపటి తరం తల్లి,నేటి బాలి కల ఆరోగ్య రక్షణ ద్వారా రేపటి త రం తల్లులను ఆరోగ్య వంతులుగా తీర్చిదిపినట్లేన నిపేర్కొన్నారు.స్త్రీ పు రుషల నిష్పత్తి లింగ వివక్షత కార ణంగా బాగా తగ్గిపోయిందని,సమా జంలో ఆడబిడ్డ యొక్క ప్రాముఖ్య త సమాజం గుర్తించాలని చెప్పారు. ఈ రోజు మనం ఆడబిడ్డలను వద్ద ను కుంటే మనకు తల్లి బిడ్డ భార్య సోదరి దొరకటం కష్టం కానున్నదని హెచ్చరించారు.ఇప్పటికే అధిక శా తం మగ పిల్లలకు పెళ్లి కాకుండా ఇ బ్బందులకు గురవుతున్నారని చె ప్పారు.కడూపులోని బిడ్డను.అబా ర్షన్ పేరుతో బ్రూణ హత్యలు చేయ డం చట్టరీత్యా నేరమని స్కానింగ్ నందు ఆడ మగ నిర్ధారణ చేయరా దని తద్వారా బ్రున హత్యలు పెరగ డానికి అవకాశం ఉందని వీటిని అరి కట్టడానికి గర్భలింగ నిర్ధారణ దుర్వి నియోగ చట్టంపై అవగాహన పెంచ డం ద్వారా లింగ వివక్షతలో రూపు మాపు వచ్చునని తెలియజేశారు. బాలికల విద్యా బాలికల భవిష్యత్తుకు తోడ్పడుతుందని ఎ లాంటి స్కూలు నుండి బడి మా నే వేయడం పిల్లలు బడి మానేయడం ద్వారా బాల్యవివాహాలు జరగడాని కి కారణం అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సి వెంకటేష్,డి ప్యూటీ హెచ్ ఈఓ,అరుణ కుమారి ప్రిన్సిపల్.రోజా ఏఎన్ఎం,ఆశ,విద్యా ర్థినులు పాల్గొన్నారు.

## రాఖీ కట్టి ఆత్మీయత చాటుకున్న బ్రహ్మకుమారీలు...!

**- సోదరభావానికి ప్రతీక రాఖీ పండుగ: కలెక్టర్**
**- జిల్లావాసులకు రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపిన ఓ.ఆనంద్**



**అనంతపురం కలెక్టరేట్ - సూర్య వాస్తవం :** రాఖీ పౌర్ణమి సందర్భంగా అనంతపురం జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్‌ను ఓం శాంతి ట్రస్ట్‌కు చెందిన బ్రహ్మకుమారీలు, మహిళలు, దివ్యాంగులు శుక్రవారం ఆత్మీయంగా కలిశారు. అనంతపురం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో కలెక్టర్‌కు మహిళలు రాఖీలు కట్టి, మిఠాయిలు తినిపించి తమ అభిమానాన్ని చాటుకున్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ ఓ.ఆనంద్ మాట్లాడుతూ రాఖీ పౌర్ణమి సందర్భంగా జిల్లాలోని ప్రతి అక్కాచెల్లెమ్మకు, అన్నదమ్ములకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు.

## మహిళలు, చిన్నారుల భద్రతకు పోలీసుల అధిక ప్రాధాన్యత

**- ఐదు సబ్ డివిజన్లలో శక్తి టీమ్స్ విస్తృత అవగాహన...!**
**- బస్టాండ్లు, రైల్వే స్టేషన్లలో 'శక్తి' యాప్ గురుంచి వివరిస్తున్న మహిళా పోలీసులు**
**- ఆపద సమయంలో శక్తి యాప్‌తో తక్షణ పోలీసు సాయం**
**- మహిళల పట్ల అసభ్య ప్రవర్తనపై నిరంతర నిఘా**



**అనంతపురం క్రైమ్ - సూర్య వాస్తవం :** మహిళలు, చిన్నారుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ జిల్లా పోలీసు శాఖ విస్తృత చర్యలు చేపడుతోంది. జిల్లా ఎస్పీ పి. జగదీష్ ఆదేశాల మేరకు జిల్లాలోని ఐదు సబ్ డివిజన్ల పరిధిలో శక్తి టీమ్స్ క్షేత్రస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాయి.ఆర్టీసీ బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, రద్దీ ప్రాంతాల్లో మహిళలు, యువతులకు 'శక్తి' యాప్ ప్రాధాన్యతను వివరించారు. స్మార్ట్‌ఫోన్‌లో యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవడం, ఆపద సమయంలో దాని ద్వారా పోలీసులను సంప్రదించే విధానాన్ని ప్రత్యక్షంగా అవగాహన కల్పించారు.రద్దీ ప్రాంతాల్లో మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించే వ్యక్తులపై నిరంతరం నిఘా కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మహిళలు, యువతులు ఎలాంటి ఆపద ఎదురైనా, అనుమానాస్పద వ్యక్తులు లేదా పరిస్థితులు కనిపించినా వెంటనే శక్తి యాప్ లేదా డయల్ 100 ద్వారా పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

# మహిళల భద్రత, గౌరవానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట

**- మహిళలందరికీ రక్షాబంధన్ శుభాకాంక్షలు... :ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్...!**
**- అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక రక్షాబంధన్**
**- మహిళల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తా: దగ్గుపాటి**





**అనంతపురం ప్రతినిధి - సూర్య వాస్తవం :** రక్షాబంధన్ పర్వదినాన్ని పురస్కరించుకుని అనంత పురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మహిళలందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. అనంతపురం అర్బన్ టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్సీ దళవాయి రమాదేవి, తెలుగుమహిళలు, బ్రహ్మకుమారీలు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌కు రాఖీలు కట్టి రక్షాబంధన్ శు భాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రక్షాబంధన్ అన్నాచెల్లెళ్ల మధ్య ఉన్న ఆత్మీయ అనుబంధం, ప్రేమానురాగాలకు ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. మహిళల భద్రత, గౌరవం, ఆత్మగౌరవం, సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తూ అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. మహిళలు ఆర్థికంగా, సామాజికంగా మరింత బలోపేతం కావడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. విద్య, యువత, మహిళా సాధికారతపై ప్రత్యేక దృష్టి సారిస్తున్న మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో మహిళలు, యువతకు మెరుగైన అవకాశాలు కల్పించే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ప్రతి మహిళ ఆత్మగౌరవంతో, స్వేచ్ఛగా, భద్రతతో జీవించేలా చేయడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.అనంతపురం అర్బన్ నియోజకవర్గ మహిళల సంక్షేమం, భద్రత, అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ హామీ ఇచ్చారు. రక్షాబంధన్ సందర్భంగా నియోజకవర్గంలోని మహిళలందరికీ ఆయన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

# ఏపీలో తొలిసారిగా జాతీయ స్థాయి వినియోగదారుల సదస్సు...!

**- సెప్టెంబర్ 12, 13 తేదీల్లో పుట్టపర్తిలో 16వ జాతీయ సదస్సు.**
**- మంత్రిని అధికారికంగా ఆహ్వానం అందించిన క్యాప్కో ప్రతినిధులు**
**- దేశవ్యాప్తంగా వినియోగదారుల సంఘాల ప్రతినిధుల హాజరు**
**- సదస్సును ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తామన్న క్యాప్కో ఛైర్మన్ జి.సురేష్ కుమార్**




**పుట్టపర్తి టౌన్ - సూర్య వాస్తవం :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తొలిసారిగా నిర్వహించనున్న 16వ జాతీయ వినియోగదారుల సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరు కావాలని రాష్ట్ర పౌర సరఫరాలు, ఆహార వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌ను ఆహ్వానించినట్లు రాష్ట్ర వినియోగదారుల సంఘాల సమాఖ్య (క్యాప్కో) ఛైర్మన్ జి. సురేష్ కుమార్ తెలిపారు.అమరావతి సచివాలయం లోని మంత్రి కార్యాలయంలో క్యాప్కో రాష్ట్ర ఉపాధ్యక్షులు కర్లపాటి శ్రీనివాసరావు, మహమ్మద్ బాజీతో కలిసి జి. సురేష్ కుమార్ మంత్రి నాదెండ్ల మనోహర్‌ను కలిశారు. ఈ సందర్భంగా సెప్టెంబర్ 12, 13 తేదీల్లో పుట్టపర్తిలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న 16వ జాతీయ వినియోగదారుల సదస్సుకు మంత్రి నాదెండ్ల మనోహర్‌ను అధికారికంగా ఆహ్వానించారు. అనంతరం పౌరసరఫరాల శాఖ కమిషనర్ కె. కన్నబాబు, ఐఏఎస్, పౌరసరఫరాల శాఖ డైరెక్టర్ నూపుర్ అజయ్ కుమార్, ఐఏఎస్‌లను కూడా సదస్సుకు ఆహ్వానించినట్లు సురేష్ కుమార్ వెల్లడించారు. సదస్సును విజయవంతంగా నిర్వహించేందుకు ప్రభుత్వం తరఫున అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని మంత్రి హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు.

**రెండు రోజుల పాటు జాతీయ సదస్సు**

సెప్టెంబర్ 12, 13 తేదీల్లో పుట్టపర్తిలో రెండు రోజుల పాటు 16వ జాతీయ వినియోగదారుల సదస్సును భారీ స్థాయిలో నిర్వహించనున్నట్లు క్యాప్కో ఛైర్మన్ జి. సురేష్ కుమార్ తెలిపారు. దేశంలోని వివిధ రాష్ట్రాలు, ప్రాంతాల నుంచి వినియోగదారుల సంఘాల ప్రతినిధులు, వినియోగదారుల హక్కుల పరిరక్షణ కోసం పనిచేస్తున్న సంస్థల ప్రతినిధులు సదస్సుకు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు.రాష్ట్ర స్థాయి అధికారులు, జాతీయ స్థాయి వినియోగదారుల సమన్వయ మండలి (సీసీసీ) ప్రతినిధులు, క్యాప్కో ప్రతినిధులు, వివిధ జిల్లాలకు చెందిన వినియోగదారుల సంఘాల సభ్యులు సదస్సులో పాల్గొననున్నారు.

**వినియోగదారుల హక్కులపై విస్తృత చర్చ**

సదస్సులో వినియోగదారుల హక్కులు, ఆహార భద్రత, నాణ్యతా ప్రమాణాలు, వినియోగదారుల రక్షణ చట్టాల అమలు తదితర కీలక అంశాలపై విస్తృతంగా చర్చించనున్నారు. వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి పరిష్కార మార్గాలు, హక్కులపై ప్రజల్లో అవగాహన పెంపొందించడం, భవిష్యత్ కార్యాచరణపై కూడా ప్రతినిధులు సమాలోచనలు చేయనున్నారు. దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి ప్రతినిధులు హాజరుకానున్న నేపథ్యంలో సదస్సును విజయవంతంగా నిర్వహించేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించినట్లు సురేష్ కుమార్ తెలిపారు. సదస్సు ఏర్పాట్లను ఇప్పటికే ముమ్మరం చేశామని, ప్రతినిధులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేపడుతున్నట్లు ఆయన వెల్లడించారు.

# జలజీవన్ మిషన్ పైప్‌లైన్ పనులు వేగవంతం చేయాలి



**- ఇంజనీరింగ్ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష...!**
**- ఇంజనీరింగ్ పనులు వేగవంతం చేయాలి.**
**- అధికారులను ఆదేశించిన కలెక్టర్ ఆనంద్**



**అనంతపురం కలెక్టరేట్ - సూర్య వాస్తవం :** జిల్లా వ్యాప్తంగా వివిధ ఇంజనీరింగ్ శాఖల పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేసి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ అధికారులను ఆదేశించారు.శుక్రవారం అనంతపురం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, మైనర్ ఇరిగేషన్ తదితర ఇంజనీరింగ్ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఆయా శాఖల పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని పరిశీలించారు.ఆర్అండ్‌బీ పరిధిలోని బ్రిడ్జి పనుల్లో పురోగతి ఆశించిన స్థాయిలో లేదని పేర్కొన్న కలెక్టర్.. టెండర్ దశలో ఉన్న, నిర్మాణంలో ఉన్న పనులను వేగవంతం చేయాలని సూచించారు. ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన-3 కింద చేపట్టిన బ్రిడ్జి పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు.పంచాయతీ రాజ్ శాఖలో సాస్కీ కింద మంజూరైన 29 పనులను వచ్చే సమీక్షా సమావేశం నాటికి గ్రౌండ్ చేయాలని సూచించారు. పీఎంజీఎస్‌వై కింద మంజూరైన 11 రోడ్లు, రెండు బ్రిడ్జిలకు అగ్రిమెంట్ ప్రక్రియ పూర్తి చేసి వచ్చే నెలలోగా పనులు ప్రారంభించాలన్నారు.
విలేజ్ హెల్త్ క్లినిక్‌ల నిర్మాణాలను వేగవంతం చేయడంతో పాటు పూర్తయిన భవనాలను సంబంధిత శాఖలకు అప్పగించాలని ఆదేశించారు. ఎంపీ నిధుల కింద మంజూరైన పనులను కూడా త్వరితగతిన గ్రౌండ్ చేసి పూర్తి చేయాలన్నారు.ఆర్‌డబ్ల్యూఎస్ పరిధిలోని హాస్టళ్లలో మరుగుదొడ్ల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అవసరమైన చోట మరమ్మతులకు ప్రతిపాదనలు పంపించాలని, పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలు, దేవాలయాల వద్ద మరుగుదొడ్ల పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు.ఆత్మకూరు--అనంతపురం పరిధిలో జలజీవన్ మిషన్ కింద పైప్‌లైన్ పనులను పది రోజుల్లో వేగవంతం చేయాలని ఆదేశించారు.మైనర్ ఇరిగేషన్ పరిధిలో ఆర్ఆర్ఆర్ కింద మంజూరైన 27 పనుల్లో ఐదు పూర్తయ్యాయని, మిగిలిన పనులను కూడా వెంటనే గ్రౌండ్ చేసి పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. నిర్ణీత టైమ్‌లైన్ ప్రకారం పనులు పూర్తయ్యేలా అధికారులు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.ఈ సమావేశంలో ఆర్అండ్‌బీ ఎస్ఈ మురళీకృష్ణ, పీఆర్ ఎస్ఈ సుబ్బరాయుడు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ కె. శ్రీనివాసులు, మైన్స్ ఏడీ ఆదినారాయణ, హెచ్ఎల్‌సీ ఎస్ఈ సుధాకర్‌రావు, సీపీఓ బాలాజీ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## విజన్ యాక్షన్ యూనిట్స్, పీ4పై సీఎం చంద్రబాబు సమీక్ష...!

- ఎంపీలు, ఎమ్మెల్యేలు, కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్
- ఎంపీ అంబికా లక్ష్మీనారాయణతో కలిసి పాల్గొన్న కలెక్టర్ ఆనంద్

జిల్లా అభివృద్ధి, ప్రభుత్వ కార్యక్రమాలపై సమీక్ష





**అనంతపురం కలెక్టరేట్ – సూర్య వాస్తవం :** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విజన్ యాక్షన్ యూనిట్స్, పీ4 తదితర అంశాలపై ఎంపీలు, నియోజకవర్గ ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణతో కలిసి జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ ఐఏఎస్ పాల్గొన్నారు. రాష్ట్రంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, విజన్ యాక్షన్ యూనిట్స్ ద్వారా నిర్దేశించిన లక్ష్యాలు, పీ4 కార్యక్రమాల అమలు తదితర అంశాలపై సీఎం చంద్రబాబు అధికారులతో సమీక్షించారు. ఆయా కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేసి ప్రజలకు మెరుగైన ఫలితాలు అందేలా చర్యలు చేపట్టాలని సూచించారు.

## ఎమ్మెల్సీ రామాదేవికి శుభాకాంక్షలు తెలిపిన బిజెపి మండల అధ్యక్షులు అంజి నాయక్




**పామిడి – సూర్య వాస్తవం :** అనంతపూర్ జిల్లా నూతనంగా ఎన్నికైనటువంటి ఎమ్మెల్సీ దలవాయి రమాదేవి కి భారతీయ జనతా పార్టీ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు రాజేష్ పరివేక్షణలో ఎమ్మెల్సీ రమాదేవికి వారి భర్త వెంకట్ నారాయణ ని శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేసిన పామిడి బిజెపి మండల అధ్యక్షులు చౌహాన్ అంజినాయక్ బిజెపి నాయకుల తదితరులు పాల్గొన్నారు.

## డ్రగ్స్‌కు నో.. ఆరోగ్యకరమైన భవిష్యత్తుకు జై...!

- ఆత్మకూరులో డ్రగ్స్ వ్యతిరేక అవగాహన ర్యాలీ




**అనంతపురం క్రైమ్ – సూర్య వాస్తవం :** ఆత్మకూరు డ్రగ్స్‌కు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని పోలీసులు ప్రజలకు పిలుపు నిచ్చారు. జిల్లా ఎస్పీ పి. జగదీష్ ఆదేశాల మేరకు ఆత్మకూరు పోలీస్ స్టేషన్, జిల్లా ఈగల్ సెల్ ఆధ్వర్యంలో డ్రగ్స్ రహిత సమాజం కోసం ఆత్మకూరులో భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు.ఈ ర్యాలీలో పోలీసు అధికారులు, సిబ్బందితో పాటు ఐదు పాఠశాలలకు చెందిన విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని డ్రగ్స్ వ్యతిరేక సందేశాన్ని చాటారు. గంజాయి, ఇతర మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, యువత తమ భవిష్యత్తును ఆరోగ్యకరమైన మార్గంలో తీర్చిదిద్దుకోవాలని పోలీసులు సూచించారు.డ్రగ్స్ విక్రయం, వినియోగం లేదా అక్రమ రవాణాకు సంబంధించిన సమాచారం ఎవరికైనా తెలిసినట్లయితే ఈగల్ టోల్‌ఫ్రీ నంబర్ 1972కు తెలియ జేయాలని అధికారులు కోరారు. సమాచారం అందించే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.డ్రగ్స్ వద్దు.. ఆరోగ్యకరమైన భవిష్యత్తు ముద్దు అనే సందేశంతో ర్యాలీ కొనసాగింది.

### రాయదుర్గం అర్బన్ సిఐగా బాధ్యతలు చేపట్టిన సిఐ దేవానంద్

**రాయదుర్గం– సూర్య వాస్తవం :** రాయదుర్గం అర్బన్ సిఐ గా దేవానంద్ బాధ్యతలు చేపట్టారు. గత రెండు నెలలుగా యుపిఎస్ సీఐ పోస్ట్ ఖాళీగా ఉండడంతో, జిల్లా ఎస్పీ జగదీష్ ఆదేశాల మేరకు శుక్రవారం అర్బన్ సీఐగా దేవానంద్ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా నూతన సిఐ దేవానంద్ సూర్య వాస్తవంతో మాట్లాడుతూ... ప్రశాంత వాతావరణంలో ఉన్న ప్రజలను ఇబ్బందికి గురిచేసిన, మట్కా, పేకాట, మద్యం ఇసుక తదితర పోలీస్ నిబంధనలకు విరుద్ధ పనులు చేపట్టిన కఠినమైన చర్యలు చేపడతామన్నారు. నిత్యం ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో నుండి ప్రజా సమస్యలను పరిష్కరించే దిశగా ప్రజలకు సేవలు అందిస్తానని, శాంతి భద్రతల పర్యవేక్షణలో పనిచేస్తూ, అరాచకాలకు పాల్పడితే ఎంతటి వ్యక్తినైనా ఉపేక్షించేది లేదని నూతన సీఐ దేవానంద్ స్పష్టం చేశారు. జిల్లా ఎస్పీ జగదీష్, కళ్యాణదుర్గం డిఎస్పి రవిబాబు పర్యవేక్షణలో రాయదుర్గం అర్బన్ పరిధిలో ప్రజలకు సేవలు అందించడమే ప్రధాన కర్తవ్యం అని నూతన సీఐ సూర్య వాస్తవంతో పేర్కొన్నారు.

# ఉరవకొండలో ఉద్రిక్తత...

- సాగునీటి కోసం రైతుల పోరుబాట...!
- హెచ్ఎల్‌సీ, జీబీసీ, హంద్రీ--నీవాకు నీరు విడుదల చేయాలని డిమాండ్
- మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో 42వ జాతీయ రహదారి దిగ్బంధం
- పంటలు ఎండిపోతున్నా ప్రభుత్వం స్పందించడం లేదంటూ రైతుల ఆగ్రహం
- హంద్రీ--నీవా బ్రిడ్జి వద్దకు భారీగా తరలివచ్చిన అన్నదాతలు
- హైవేపైనే భోజనాలు చేస్తూ రైతుల వినూత్న నిరసన
- పురుగుల మందు డబ్బాలతో నిరసన తెలిపిన రైతులు




**ఉరవకొండ టౌన్ – సూర్య వాస్తవం :** సాగునీటి కోసం ఉరవకొండ నియోజకవర్గ రైతులు రోడ్డెక్కారు. తుంగభద్ర ఎగువ కాలువ (హెచ్ఎల్‌సీ) ఆయకట్టు, గుంతకల్లు బ్రాంచ్ కెనాల్ (జీబీసీ), హంద్రీ--నీవా కాలువలకు వెంటనే సాగునీరు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో భారీ ఆందోళన చేపట్టారు. మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ ఉరవకొండ నియోజకవర్గ సమన్వయకర్త వై. విశ్వేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో రైతులు ఉరవకొండ సమీపంలోని హంద్రీ--నీవా బ్రిడ్జి వద్ద నిరసనకు దిగారు.అనంతపురం--బళ్లారి 42వ జాతీయ రహదారిపై రైతులతో కలిసి మాజీ ఎమ్మెల్యే బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. దీంతో హైవేపై వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడి ఉద్రిక్త వాతావరణం నెలకొంది. సమస్య పరిష్కరించే వరకు కదిలేది లేదంటూ రైతులు హైవేపైనే భోజనాలు చేస్తూ నిరసన కొనసాగించారు. కొందరు రైతులు పురుగుల మందు డబ్బాలతో నిరసన వ్యక్తం చేశారు.

**పంటలు ఎండిపోతున్నాయంటూ ఆవేదన**

వర్షాలు లేక ఇప్పటికే పలు గ్రామాల్లో సాగు చేసిన పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మరో వారం రోజుల్లోగా సాగునీరు అందకపోతే వేలాది ఎకరాల్లో పంటలు దెబ్బతిని కోట్లాది రూపాయల నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని తెలిపారు. అప్పులు చేసి పెట్టుబడులు పెట్టిన రైతులు నీటి కోసం ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు.

**ప్రాజెక్టుల్లో నీళ్లున్నా.. రైతులకు ఎందుకు ఇవ్వరు?**

శ్రీశైలం, తుంగభద్ర ప్రాజెక్టుల్లో నీటి లభ్యత ఉన్నప్పటికీ ఆయకట్టు రైతులకు సాగునీరు ఎందుకు విడుదల చేయడం లేదని విశ్వేశ్వరరెడ్డి ప్రశ్నించారు. తుంగభద్ర పరిధిలో కర్ణాటక రైతులు పంటలు సాగు చేసుకుంటుంటే రాయలసీమ రైతులు నీటి కోసం రోడ్లపైకి రావాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చిందని నిలదీశారు. రాయలసీమ రైతులకు సాగునీటి విషయంలో ప్రభుత్వం న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

**ప్రభుత్వంపై మాజీ ఎమ్మెల్యే మండిపాటు**

రైతుల కష్టాలు ప్రభుత్వానికి కనిపించడం లేదా అని విశ్వేశ్వరరెడ్డి ప్రశ్నించారు. మంత్రి పయ్యావుల కేశవ్ ప్రాతినిధ్యం వహిస్తున్న ఉరవకొండ నియోజకవర్గంలోనే రైతులు సాగునీటి కోసం హైవేపైకి వచ్చి ఆందోళన చేయాల్సిన పరిస్థితి ఏర్పడటం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమన్నారు. తాగునీటితో పాటు సాగునీటి అవసరాలను కూడా ప్రభుత్వం సమతుల్యంగా పరిగణించాలని కోరారు. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పూర్తయి ఉంటే ఈ ప్రాంత రైతులు సాగునీటి కోసం రోడ్లపైకి వచ్చే పరిస్థితి ఉండేది కాదన్నారు. రాయలసీమలో సాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు.

**సెప్టెంబర్ 1 వరకు గడువు**

హెచ్ఎల్‌సీ, జీబీసీ, హంద్రీ--నీవా కాలువలకు వెంటనే సాగునీరు విడుదల చేయాలని విశ్వేశ్వరరెడ్డి డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 1లోగా ప్రభుత్వం స్పందించి నీరు విడుదల చేయాలని, లేదంటే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. రైతులకు నీరు అందించే వరకు పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

**ఆందోళనను అడ్డుకునేందుకు భారీ బందోబస్తు**

రైతుల ఆందోళన నేపథ్యంలో పోలీసులు భారీగా బందోబస్తు ఏర్పాటు చేశారు. పలు ప్రాంతాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి రైతులను నిరసన స్థలానికి రాకుండా అడ్డుకునే ప్రయత్నం చేసినట్లు రైతులు ఆరోపించారు. వాహనాలను తనిఖీ చేస్తూ కదలికలను నియంత్రించేందుకు పోలీసులు ప్రయత్నించారు. అయితే ఆంక్షలను లెక్కచేయకుండా వివిధ గ్రామాల నుంచి రైతులు పెద్దఎత్తున హంద్రీ--నీవా బ్రిడ్జి వద్దకు చేరుకున్నారు. అనంతరం జాతీయ రహదారిపై బైఠాయించి సాగునీటి కోసం గళమెత్తారు. నీరు విడుదల చేసే వరకు ఆందోళన కొనసాగిస్తామని రైతులు స్పష్టం చేశారు.




## మందు డబ్బాలతో రైతులను..ఖాళీ బిందెలతో మహిళలను

# రోడ్డున పడేసిన ప్రభుత్వం...!

- జిల్లా నీటి భద్రతకు అత్యవసర చర్యలు చేపట్టాలి: వైసీపీ నేత కె.వి. రమణ



**అనంతపురం టౌన్ – సూర్య వాస్తవం :** దేశంలోనే ప్రత్యేక భౌగోళిక, వాతావరణ పరిస్థితులు ఉన్న ఉమ్మడి అనంతపురం జిల్లాపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని వైఎస్ఆర్‌సీపీ రాయలసీమ జోనల్ అధికార ప్రతినిధి కె.వి. రమణ డిమాండ్ చేశారు. జిల్లాలో తాగునీరు, సాగునీటి భద్రత కోసం తక్షణ చర్యలు చేపట్టకపోతే పరిస్థితులు మరింత తీవ్రమయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు.జిల్లాలో సాధారణంగా సుమారు 530 మిల్లీమీటర్ల వర్షపాతం మాత్రమే నమోదవుతుందని, ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావంతో వర్షపాత లోటు మరింత పెరిగే పరిస్థితులు ఉన్నాయని రమణ పేర్కొన్నారు. ఇప్పటికే నీటి ఎద్దడితో రైతులు, మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, రైతులు మందు డబ్బాలతో.. మహిళలు ఖాళీ బిందెలతో రోడ్డెక్కాల్సిన పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు.

**జిల్లా అవసరాలకే తొలిప్రాధాన్యత**

శ్రీశైలం జలాశయం నుంచి నాగార్జునసాగర్‌కు, విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల ద్వారా నీటి తరలింపును తక్షణమే నిలిపివేయాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతపురం జిల్లాకు ఆధారమైన హెచ్ఎల్‌సీ, హెచ్ఎన్ఎస్ఎస్ నీటిని ముందుగా జిల్లా అవసరాల కోసం భద్రపరచాలని కోరారు.గత ఏడాది అస్తవ్యస్తమైన నీటి నిర్వహణ కారణంగా జిల్లాలోని రిజర్వాయర్లు, చెరువుల్లో తగినంత నీటి నిల్వలు లేకుండా పోయాయని, ఫలితంగా భూగర్భ జలాలు పడిపోతూ బోర్లు ఎండిపోతున్నాయని తెలిపారు.

**నీటి తరలింపుపై స్పష్టత ఇవ్వాలి**

శ్రీశైలం నుంచి తెలంగాణలోని విద్యుత్ కేంద్రాల ద్వారా నాగార్జునసాగర్‌కు చేరే నీటిని ఉభయ రాష్ట్రాలు వినియోగించుకుంటాయని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు చేసిన వ్యాఖ్యలు రాయలసీమ ప్రయోజనాలకు నష్టం కలిగించేలా ఉన్నాయని రమణ విమర్శించారు. అవసరానికి మించి నీటి తరలింపు జరుగుతోందని ఆరోపించారు.2026 అక్టోబర్ వరకు ప్రధానంగా తాగునీటి అవసరాల కోసం మాత్రమే నీటిని వినియోగించుకోవాలని ప్రభుత్వం చెబు తున్న నేపథ్యంలో, ఆ నిర్ణయానికి ఆధారం ఏమిటో ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేశారు.

**శాస్త్రీయంగా నీటి అవసరాల అంచనా**

2026 అక్టోబర్ వరకు ఉమ్మడి అనంతపురం జిల్లాకు అవసరమైన తాగునీటి పరిమాణంతో పాటు 2027 జూలై వరకు అవసరమయ్యే నీటిని శాస్త్రీయంగా అంచనా వేయాలని రమణ కోరారు.ఇప్పటికే శ్రీశైలం జలాశయం నుంచి సుమారు 53 టీఎంసీల నీరు నాగార్జునసాగర్‌కు తరలించినట్లు తెలుస్తోందని పేర్కొన్నారు. కరువు ప్రాంతాలకు నీటి భద్రత కల్పించాల్సిన సమయంలో శ్రీశైలం జలాశయం నుంచి అవసరానికి మించి నీటిని తరలించడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు.

**క్యారీ ఓవర్ నిల్వ ఉంటే పరిస్థితి భిన్నంగా ఉండేది**

గత ఏడాది హంద్రీ–నీవా, హెచ్ఎల్‌సీ ద్వారా వచ్చిన సుమారు 55 టీఎంసీల నీటిని క్యారీ ఓవర్ నిల్వగా భద్రపరిచి ఉంటే, ఈ ఏడాది వచ్చిన నీటితో కలిపి సుమారు 85 నుంచి 95 టీఎంసీల నీటిని సమర్థవంతంగా నియంత్రించుకునే అవకాశం ఉండేదని రమణ తెలిపారు. తద్వారా సాగు అవసరాలతో పాటు తాగునీటి అవసరాలను కూడా తీర్చే అవకాశం ఉండేదని పేర్కొన్నారు.

**36 వేల ఎకరాల ఆయకట్టుకు నీరందించాలి**

జిల్లాలోని రిజర్వాయర్లు, చెరువుల్లో నీటిని నిల్వ ఉంచి తాగునీటి భద్రతను కాపాడటం ప్రభుత్వ తొలి ప్రాధాన్యత కావాలని ఆయన అన్నారు. హెచ్ఎల్‌సీ కింద రాయదుర్గం, కనేకల్, విడపనకల్, గుంతకల్లు బ్రాంచ్ కెనాల్ పరిధిలోని సుమారు 36 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు.శ్రీశైలం నుంచి విద్యుత్ ఉత్పత్తి ద్వారా విడుదలయ్యే నీటిని సమిష్టిగా వినియోగించు కుంటామనే ప్రభుత్వ వైఖరి రాయలసీమ నీటి హక్కులకు నష్టం కలిగించే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

**కేంద్రం దృష్టికి తీసుకెళ్లాలి**

కృష్ణా జలాల నిర్వహణపై కేఆర్ఎంబీ, సీడబ్ల్యూసీ సమావేశాల్లో స్పష్టమైన నిర్ణయం తీసుకోలేని పరిస్థితి ఉంటే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్వయంగా కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దృష్టికి సమస్యను తీసుకెళ్లాలని రమణ కోరారు.రాయలసీమ ఎదుర్కొంటున్న నీటి సమస్యను ప్రభుత్వం అత్యంత తీవ్రంగా పరిగణించి శాశ్వత పరిష్కారం కోసం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. నీటి నిల్వలను కాపాడుతూ తాగునీరు, ఆరుతడి పంటలకు సాగునీటి భద్రత కల్పించాలని, అనంతపురం జిల్లాను ఎడారిగా మార్చే నిర్ణయాలకు స్వస్తి పలకాలని వైఎస్ఆర్‌సీపీ అధికార ప్రతినిధి, కె.వి. రమణ కోరారు.

Truth of News
సూర్య వాస్తవం
http://www.suryavastavam.in



# ఇథనాల్ పెట్రోల్ తో దోపిడి ....చక్కెర, ఉల్లి ధరలతో నిలువు దోపిడీ

## - కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పఠాన్ మహమ్మద్ అలీ ఖాన్ ధ్వజం




**కడప -సూర్య వాస్తవం:** కేంద్రంలోని ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వం, రాష్ట్రంలోని సీఎం చంద్రబాబు నాయుడు ప్రభుత్వం ప్రజలను నిలువు దోపిడీ చేస్తున్నాయని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పఠాన్ మహమ్మద్ అలీ ఖాన్ ధ్వజమెత్తారు. కడపలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వం ఇథనాల్ పెట్రోల్ తో ప్రజల నుంచి డబ్బులు దండుకుంటుందని ఆరోపించారు. మరోవైపు కిలో చక్కెర ధర 45 రూపాయల నుంచి 70 రూపాయలకు పెరిగిందన్నారు. అంతే కాకుండా ఉల్లి ధర ఒక కిలో 14 రూపాయల నుంచి 60 రూపాయలకు పైగా చేరిందన్నారు. పర్యవసానంగా ప్రజలు పెరిగిన ధరలతో నిలువు దోపిడీకి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇథనాల్ పెట్రోల్ తయారు చేసేందుకు దేశంలో వి రివిగా పండిన చెరుకును వినియోగించడం వల్ల చక్కెర కొరత తీవ్రమైందన్నారు. ఇ 20 పెట్రోల్ ద్వారా ప్రధాని నరేంద్ర మోడీ, హోం మంత్రి అమిత్ షా, కేంద్ర మంత్రులు నితిన్ గట్కరి, సీఎం చంద్రబాబు ప్రజలు ప్రజలను దోచుకుంటున్నారన్నారు. చక్కెర ఉత్పత్తికి వినియోగించాల్సిన చెరుకును కేవలం ఐ పెట్రోలు మళ్ళించడం వల్ల ప్రజలకు చక్కెర కూడా లభ్యత కాకుండా కరువైందన్నారు మరోవైపు సామాన్య ప్రజలకు బుల్లి ఒక కిలో 70 రూపాయలకు పెరిగిందన్నారు. ఈ విధంగా కేంద్ర, రాష్ట్ర డబుల్ ఇంజిన్ సర్కా లు ప్రజలను ఆర్థికంగా నడ్డి విరుస్తున్నాయన్నారు. దౌర్భాగ్యపు పరిపాలన చేస్తున్న ప్రధాని నరేంద్ర మోడీ, సీఎం చంద్రబాబు ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అనంతరం కడప అసెంబ్లీ కోఆర్డినేటర్ బండి జకరయ్య మాట్లాడుతూ నిత్యవసర వస్తువుల ధరలు పెరిగిపోయాన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాల హాయంలో చౌకగా లభించే వస్తువుల ధరలు పెరగడం బాధాకరమన్నారు. కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు మయాన రహమతుల్లా ఖాన్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల నడ్డి విరుస్తున్నాయన్నారు. ధరల పెరుగుదలతో సామాన్యుడు దుర్భర జీవితం జీవిస్తున్నారన్నారు. వెంటనే ప్రభుత్వాలు ధరలను అదుపు చేయకపోతే కాంగ్రెస్ పార్టీ ఉద్యమం చేపడుతుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కమల్ భాష, డిసిసి ప్రధాన కార్యదర్శి సుధాకర్, కేకేసి చైర్మన్ శ్రీనివాసులు, కాంగ్రెస్ పార్టీ డివిజన్ ప్రతినిధులు హమీద్, రఫీ ఖాన్, జహ్వార్, తదితరులు పాల్గొన్నారు.

# పెన్నానగర్‌లో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్



**ప్రొద్దుటూరు -సూర్య వాస్తవం :** ప్రజల శాంతి భద్రతలకు విఘాతం కలిగించే అసాంఘిక కార్యకలాపాలపై పోలీస్ శాఖ ఉక్కుపాదం మోపుతోందని ఎఎస్పీ విభూ కృష్ణ తెలిపారు. కడప జిల్లా ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు, ఎఎస్పి విభుక్రిష్ణ ఆధ్వర్యంలో, ప్రొద్దుటూరు సబ్ డివిజన్ పరిధిలోని అధికారులు మరియు సిబ్బంది తో కలిసి పెన్నానగర్ నందు కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఎస్పి విభూ కృష్ణ మాట్లాడుతూ ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని, అక్రమ మద్యం, గంజాయి మరియు ఇతర మాదకద్రవ్యాల అక్రమ రవాణా, పేకాట, బెట్టింగ్, రౌడీయిజం, అక్రమ కార్యకలాపాలు తదితర చట్టవిరుద్ధ చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేశారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై నిరంతరం నిఘా కొనసాగిస్తూ, అందిన సమాచారం మేరకు ప్రత్యేక తనిఖీలు మరియు దాడులు నిర్వహిస్తున్నామని తెలిపారు. చట్టాన్ని ఉల్లంఘించే వ్యక్తులు ఎంతటి వారైనా, వారి స్థాయి మరియు హోదాతో సంబంధం లేకుండా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ముఖ్యంగా యువత మాదకద్రవ్యాలు మరియు ఇతర అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని, తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ప్రజలు తమ పరిసరాల్లో జరుగుతున్న అసాంఘిక లేదా అనుమానాస్పద కార్యకలాపాలపై పోలీసులకు సమాచారం అందించాలని, సమాచారం అందించే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ప్రజల భద్రత విషయంలో రాజీ లేదు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అసాంఘిక శక్తులపై చట్టపరంగా కఠిన చర్యలు తప్పవు అని స్పష్టం చేశారు. ఈ ఆపరేషన్ లో భాగంగా సస్పెక్ట్ షీటర్స్ , అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న వారి యొక్క ఇల్లను గుర్తించి తనిఖీ నిర్వహించారు. అదేవిధంగా 28 మోటార్ వాహనాలు స్వాధీనం చేసుకున్నారు.

# యువత హక్కు ప్రభుత్వం జవాబు దారీతనం




**ప్రొద్దుటూరు -సూర్య వాస్తవం :** ప్రభుత్వం యువత హక్కులను జవాబు దారీతనంగా ఉండాలని వైయస్ఆర్సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివ ప్రసాద్ రెడ్డి తెలిపారు. ఆయన అధ్యక్షతన యువనాయకులు రాచమల్లు రాఘవేంద్ర రెడ్డి మరియు రాష్ట్ర యువజన విభాగం సెక్రటరీ బండి వినీత్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రొద్దుటూరు పట్టణంలోని దొరసానిపల్లె లో గల రాచమల్లు శివ ప్రసాద్ రెడ్డి నివాసం నందు యువతతో వైఎస్సార్ సీపీ యూత్ మీట్ అప్ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో యువతకు 3000/- రూపాయలు నిరుద్యోగ బృతి మరియు ఉద్యోగాలను ఇస్తామని చెప్పి నేడు ఆ హామీలను విస్మరించిన అంశాలపై యువతకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున్న నియోజకవర్గ వైయస్ఆర్సీపీ యువనాయకులు,కార్యకర్తలకు మరియు నియోజకవర్గ యువకులు పాల్గొన్నారు.

# శ్రీ వీరభద్ర స్వామి దేవస్థానంలో శాశ్వత అన్నదానానికి విరాళం

### -మరొకరు నిత్యాన్నదానానికి విరాళం రూ.25000/-

**రాయచోటి-సూర్య వాస్తవం:** అన్నమయ్య జిల్లా పరిధిలోని నియోజకవర్గ కేంద్రమైన రాయచోటి పట్టణంలో వెలసిన శ్రీ భద్రకాళి సమేత శ్రీ వీరభద్ర స్వామి దేవస్థానం నందు ప్రతిరోజు జరుగు నిత్య అన్నదాన పథకానికి మఠం సాయి శంకర్ అనంతపురం వాసులు రూ.1,00,000/- శాశ్వత అన్నదానానికి విరాళంగా ఇచ్చారు. అలాగే హాలో మఠం ఓంకార బాబు శాశ్వత నిత్యాన్న దానానికి 25000/- రూపాయలు విరాళంగా ఇచ్చారు, వీరికి దేవస్థానము రసీదు అందజేయడం జరిగిందని ఆలయ చైర్మన్ తిరుమల మనోజ్ కుమార్, ఆలయ కార్యనిర్వాహణాధికారి డి.వి. రమణారెడ్డి లు తెలియజేస్తూ వారిని వారి కుటుంబ సభ్యులని స్వామివారి సన్నిధిలో అర్చక స్వాములు స్వామివారి వస్త్రంతో సన్మానించి ఎల్లవేళలా ఆయురారోగ్యాలతో ఉండాలని దీవించి తీర్థప్రసాదాలు అందజేశారు.




# పేదరిక నిర్మూలనే లక్ష్యం..

- ప్రతి నిరుపేద కుటుంబాన్ని ఆర్థికంగా బలోపేతం చేయాలి
- పీ4, విజన్ యాక్షన్ యూనిట్ల ద్వారా ఫలితాల సాధనకు సమన్వయంతో పనిచేయాలి
- నిరుపేదలకు సంక్షేమ పథకాలు, ఉపాధి అవకాశాలు, వనరులను అనుసంధానం చేయాలి: జాయింట్ కలెక్టర్ శివ నారాయణ శర్మ




**అన్నమయ్య బ్యూరో- సూర్య వాస్తవం :**విజన్ యాక్షన్ యూనిట్లు, జీరో పావర్టీ--పీ4 (పబ్లిక్--ప్రైవేట్--పీపుల్--పార్ట్నర్‌షిప్) కార్యక్రమాల ద్వారా పేదరిక నిర్మూలనకు చేపడుతున్న చర్యలపై రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శుక్రవారం విజయవాడ నుంచి ఎంపీలు, ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్లు, నియోజకవర్గ ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు తదితరులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో రాయచోటి నుంచి రాష్ట్ర యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పాల్గొనగా, మదనపల్లె కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జాయింట్ కలెక్టర్ శివ నారాయణ శర్మ, సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి పాల్గొన్నారు.జిల్లాలో విజన్ యాక్షన్ యూనిట్ల పనితీరు, జీరో పావర్టీ--పీ4 కార్యక్రమాల పురోగతి, అమలు తీరు, నిరుపేద కుటుంబాల ఆర్థిక స్థితిగతులను మెరుగుపరిచేందుకు చేపడుతున్న చర్యలను ముఖ్యమంత్రి సమీక్షించారు.అనంతరం జాయింట్ కలెక్టర్ శివ నారాయణ శర్మ అధికారులతో సమీక్షిస్తూ, పీ4 కార్యక్రమం ద్వారా అర్హులైన నిరుపేద కుటుంబాలను గుర్తించి, వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, వివిధ వనరులు, ఉపాధి అవకాశాలను సమన్వయం చేసి అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి కుటుంబం ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించే దిశగా కార్యాచరణ ఉండాలని, శాఖల మధ్య సమన్వయంతో పీ4 లక్ష్యాలను సాధించాలని ఆదేశించారు. రాయచోటి నుంచి సీఎం నారా చంద్రబాబు నాయుడికి పీ4, విజన్ యాక్షన్ ప్లాన్‌పై వివరాలు

సీఎం నారా చంద్రబాబు నాయుడు విజన్‌ను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేసేందుకు ఏర్పాటైన సి వి ఏ పి యు లు ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా, రాయచోటి నుంచి రాష్ట్ర మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో యంగ్ ప్రొఫెషనల్ పి. ఉమామహేశ్వర్ రావు వర్చువల్ సమావేశంలో పాల్గొని రాయచోటి నియోజకవర్గంలో కార్యక్రమాల పురోగతిని ముఖ్యమంత్రికి వివరించారు. నియోజకవర్గంలోని 46 ఫ్లోరైడ్ ప్రభావిత గ్రామాల్లో తొలిదశగా 20 గ్రామాల్లో జూ= నిధులతో మినరల్ వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రజల సమస్యలను గుర్తించి సత్వర పరిష్కారం చూపడంతో పాటు, అభివృద్ధి కార్యక్రమాలను నిర్దేశిత లక్ష్యాల మేరకు ఫలితాల దిశగా తీసుకెళ్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో సీపీఓ వెంకట పెద్దయ్య, డ్వామా పీడీ నాగేశ్వరరావు, డీఐఓ కృష్ణకుమార్, మదనపల్లె మునిసిపల్ కమిషనర్ ప్రమీల, జిల్లా, మండల స్థాయి సంబంధిత అధికారులు, నియోజకవర్గ ప్రత్యేక అధికారులు, యంగ్ ప్రొఫెషనల్స్, విజన్ స్టాఫ్ యూనిట్ సభ్యులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



# హాస్టల్ భవనాలను తమకు అప్పజెప్పాలంటూపాలిటెక్నిక్ విద్యార్థుల ధర్నా

### - తుమ్మల లవకుమార్ ఏయస్ఐపీరాష్ట్ర అధ్యక్షులు




**అన్నమయ్య బ్యూరో -సూర్య వాస్తవం:** రాయచోటిలో జిల్లా పోలీసు కార్యాలయానికి తాత్కాలికంగా స్వాధీనం చేసుకున్న తమ హాస్టల్ భవనాలను తిరిగి తమకు అప్పగించాలని రాయచోటి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు కళాశాల గేటు వద్ద శుక్రవారం ధర్నా చేశారు. అఖిలభారత స్టూడెంట్స్ పవర్ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల లవకుమార్ ఆధ్వర్యంలో సుమారు 150 మంది పాలిటెక్నిక్ విద్యార్థులు శుక్రవారం ఉదయం తరగతులు బహిష్కరించి కళాశాల గేటు వద్ద ప్లకార్డ్స్ ధరించి తమ హాస్టల్ చెప్పాలని నినాదాలు చేసి ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా లవ కుమార్ మాట్లాడుతూ 2022 లో అన్నమయ్య జిల్లా కేంద్రంగా రాయచోటిని ప్రకటించిన సందర్భంలో ఎస్పీ కార్యాలయం కోసం పాలిటెక్నిక్ విద్యార్థుల హాస్టల్ భవనాలను తాత్కాలికంగా ప్రభుత్వం స్వాధీనం చేసుకున్నదని అన్నారు. జిల్లా కేంద్రంలో రాయచోటి నుండి మదనపల్లి తరలిన తర్వాత ఎస్పీ ఆఫీసు జిల్లా కార్యాలయం అన్నీ కూడా మదనపల్లెకు తరలిపోయాయని ఇప్పుడైనా తమ హాస్టల్ భవనాలు తమకు అప్పజెప్పాలని విద్యార్థుల నినాదాలు చేశారు.రాయచోటి పట్టణం నందు గల పాలిటెక్నిక్ కళాశాలలో ప్రస్తుతం 250 మంది విద్యార్థులు చదువు కుంటున్నారని వారికి హాస్టల్ వసతి లేదని విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం ఆ కళాశాల హాస్టల్ భవనాలను హాస్టల్ భవనం నిర్మించిన తర్వాత పాలిటెక్నిక్ విద్యార్థులు వివిధ జిల్లాల నుండి వందలాదిమంది విద్యార్థులు ఆ కళాశాలలో చదువుకుంటూ వసతిగృహంలో ఉండేవారని భోజనం మరియు ఇతర మౌలిక సౌకర్యాలు ఆ విద్యార్థులకు ఉండేవని అన్నారు. అయితే హాస్టల్ భవనమును ఎస్పీ గారి కార్యాలయానికి ఇచ్చిన తర్వాత కళాశాల విద్యార్థులు పట్టణంలో ఉన్నటువంటి బిసి ఎస్సి హాస్టల్స్ లో ఉంటూ 6 కిలోమీటర్ల మేర బస్సులలో ఆటోలలో ప్రయాణం చేసి ఉదయం టిఫిన్ చేసి మధ్యాహ్నం తిరిగి హాస్టల్ కు వెళ్లి తిని రావడానికి వీలు లేక ఉదయం చేసిన భోజనాన్నే తీసుకొని వచ్చి మధ్యాహ్నం తిని తిరిగి మళ్ళీ హాస్టల్స్ కి వెళ్లే పరిస్థితి వారికి నెలకొని ఉందని వారు మండిపడ్డారు.అంతేకాకుండా ప్రభుత్వ హాస్టల్స్ లో సీట్లు దొరకక ప్రైవేట్ హాస్టల్స్ లో నాలుగు వేల నుండి 5వేల రూపాయల వరకు డబ్బులు కట్టి వారు ఉండాల్సినటువంటి పరిస్థితి నెలకొని ఉందని వారు ఆవేదన వ్యక్తం చేశారు.ఎస్పీ కార్యాలయ నిర్వహణకు తాత్కాలికంగా ఇచ్చినటువంటి పాలిటెక్నికల్ కళాశాల విద్యార్థుల వసతృహ భవనమును తిరిగి ఆ కళాశాల విద్యార్థులకు అప్పజెప్పాలని తద్వారానే వివిధ జిల్లాల నుండి వచ్చి ఇక్కడ విద్యను అభ్యసించే పేద ,మధ్యతరగతి విద్యార్థులకు బంగారు భవిష్యత్తును అందించిన వారు అవుతారని లేనిపక్షంలో విద్యార్థులకు అప్పజెప్పేవరకు అఖిల భారత విద్యార్థి పవర్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని రాష్ట్ర అధ్యక్షులు లవకుమార్ హెచ్చరించారు ఈ కార్యక్రమంలో 150 మంది పాలిటెక్నిక్ విద్యార్థులు మరియు ఏఐఎస్ పి జిల్లా నాయకులు పాల్గొన్నారు.



# బన్నీ, చెర్రీలకు అరుదైన గుర్తింపు

టాలీవుడ్‌కు చెందిన స్టార్ హీరోలుఅల్లు అర్జున్ రామ్‌చరణ జాతీయ స్థాయిలో సత్తాచాటారు. భారతదేశంలోని టాప్ 100 ప్రముఖ సెలబ్రిటీలతో 'ఫోర్బ్స్ ఇండియా' రూపొందించిన ప్రతిష్టాత్మకమైన 'షో స్టాపర్స్ 2026' జాబితాలో వీరిద్దరూ చోటు దక్కించుకున్నారు. దేశవ్యాప్తంగా వినోదం, క్రీడలు, పాపులర్ కల్చర్‌కు చెందిన 100 మంది సెలబ్రిటీలతో రూపొందించిన ఈ జాబితాలో తెలుగు చిత్రపరిశ్రమ నుంచి వీరిద్దరే ఉండడం విశేషం.అంతేకాదు, తాజా 'షో స్టాపర్స్ 2026' ఎడిషన్ కవర్‌పై ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ తనదైన స్టైల్లో మెరిశారు. 'పుష్ప' ఫ్రాంచైజీతో ఇప్పటికే పాన్ ఇండియా స్థాయిలో ఉన్న అల్లు అర్జున్ క్రేజ్.. ఇప్పుడు 'ఫోర్బ్స్ ఇండియా' కవర్ పేజీ రూపంలో తెలుగు రాష్ట్రాలకే పరిమితమైన స్టార్ ఇమేజ్ నుంచి జాతీయ స్థాయి స్టార్‌గా ఎదిగారు. మరోవైపు గ్లోబల్ స్టార్ రామ్‌చరణ్ కూడా తాజా షోస్టాపర్స్ జాబితాలో స్థానం సంపాదించారు.'ఆర్‌ఆర్‌ఆర్' సినిమాతో అంతర్జాతీయంగా గుర్తింపు తెచ్చుకున్న రామ్‌చరణ్.. తెలుగు సినిమాకు ప్రపంచవ్యాప్తంగా వచ్చిన క్రేజ్‌లో కీలక పాత్ర పోషించారు. పాన్ ఇండియా సినిమాల హవా కొనసాగుతున్న వేళ.. టాలీవుడ్ నుంచి ఇద్దరు అగ్ర కథానాయకులకు దేశంలోని అత్యంత ప్రభావశీల సెలబ్రిటీల జాబితాలో చోటు దక్కడం తెలుగు సినిమా స్థాయిని మరోసారి చాటిచెప్పినట్టయింది.

**బాలీవుడ్, సౌత్ స్టార్లకూ చోటు..**

ఫోర్బ్స్ ఇండియా షోస్టాపర్స్ 2026 జాబితాలో ఉత్తరాది, దక్షిణాది నటీనటులకు కూడా చోటు దక్కింది. బాలీవుడ్ నుంచి షారుఖ్‌ఖాన్, ప్రియాంక చోప్రా జోనస్, రణ్‌వీర్ సింగ్ వంటి ప్రముఖులు చోటు దక్కించుకున్నారు. దక్షిణాది నుంచి రజనీకాంత్, కమల్‌హాసన్, దళపతి విజయ్, మోహన్‌లాల్, మమ్ముట్టి వంటి అగ్ర తారలు కూడా షోస్టాపర్స్‌గా నిలిచారు.

# 'రంభ ఊర్వశి మేనక'.. థియేటర్లలో వేడుక




అల్లరి నరేశ్ ఫాంటసీ కామెడీ 'రంభ ఊర్వశి మేనక'(ఞఎఎష్ఘు, ఖతీఙుంష్ట్రఱ, వీవఋుఎఘు)తో అలరించబోతున్నారు. ఈ చిత్రాన్ని చంద్రమోహన్ చింతాడ దర్శకత్వంలో అన్నపూర్ణ స్టూడియోస్ హాస్య మూవీస్ బ్యానర్‌పై రాజేశ్ దండా, నిమ్మకాయల ప్రసాద్ నిర్మించారు. ఇందులో సురభి, రాశిసింగ్, విష్ణుప్రియ, ప్రిషా సింగ్ హీరోయిన్లుగా నటించగా, వెన్నెల కిషోర్, నరేశ్ వీకే, శ్రీనివాస్‌రెడ్డి, రచ్చ రవి, మురళీధర్‌గౌడ్ ఇతర ముఖ్యపాత్రలను పోషించారు.ఈ చిత్రం సెప్టెంబర్ 4న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ గురువారం టైటిల్ సాంగ్‌ను రిలీజ్ చేశారు. 'రంభ ఊర్వశి మేనక.. స్టెప్ వేస్తే తెల్లార్లూ వేడుక..' అంటూ సాగుతున్న ఈ పాట సంగీతప్రియుల్లో జోష్ నింపుతోంది. ఈ సాంగ్ లాంచ్ ఈవెంట్‌లో హీరోయిన్ రాశి సింగ్ మాట్లాడుతూ.. "ఇప్పటివరకు నేను చేసిన సినిమాల్లో ఇది చాలా డిఫరెంట్. చాలా కొత్తగా, మంచి ఎంటర్‌టైన్‌మెంట్ ఉంటుంది.ఈ సినిమా కోసం ఆహార నియమాలు చాలా కఠినంగా పాటించాను. షూటింగ్ కూడా మాకు చాలా ఛాలెంజింగ్‌గా అనిపించింది" అని తెలిపింది. ప్రిశా సింగ్ మాట్లాడుతూ.. "ఈ సాంగ్‌కు అందరూ డాన్స్ చేస్తారు. ప్రతి ఒక్కరికీ ఈ పాట నచ్చుతుంది. సెప్టెంబర్ 4న అందరూ ఈ సినిమాని థియేటర్లో చూసి ఎంజాయ్ చేస్తారని కోరుకుంటున్నా" అని చెప్పింది.విష్ణుప్రియ మాట్లాడుతూ.. "థియేటర్‌లో ఈ పాట అందరినీ సీట్లో నుంచి లేచి డాన్స్ చేసేలా చేస్తుంది. ఇప్పటివరకు రంభ, ఊర్వశి, మేనకలు ఒక డాన్స్‌కో, సన్నివేశానికో రావడం చూశాం. కానీ ఈ కథ మాత్రం చుట్టూ రంభ, ఊర్వశి, మేనకల చుట్టూనే తిరుగుతుంది. అందరికీ కనెక్ట్ అయ్యే కథ" అని తెలిపింది.






# అద్భుతంగా ఆడారు




కొలంబో, ఆగస్టు 28 : వరల్ టెస్ట్ చాంపియన్ షిప్ ఫైనల్ రేసులో నిలవాలంటే తప్ప క గెలవాల్సిన శ్రీలంక సిరీస్‌లో భారత్ 1-0 తో విజయం సాధించింది. అయితే 2-0తో సిరీస్ గెలిచే అవకాశం లంక అద్భుత పోరాటంతో చేజారిపోయింది. ఈ నేపథ్యంలో భా రత్ వ్యూహాలపై విమర్శలు వచ్చాయి. హెడ్ కోచ్ గౌతం గంభీర్ మాత్రం తన వ్యూహాల ను పరోక్షంగా సమర్థించుకున్నాడు. భారత్ ఆటగాళ్లు అద్భుతంగా ఆడారని ప్రశంసించా డు. ఈ విజయంపై స్పందిస్తూ ట్వీట్ చేశా డు. టెస్ట్ క్రికెట్‌కు క్యారెక్టర్, సహనం, మానసిక దృఢత్వం చాలా అవసరమని, మన ఆటగాళ్లు చివరి వరకు పోరాడి అదే నిరూపించారని అన్నారు.రెండో టెస్టులో అద్భుత మైన బ్యాటింగ్‌తో మ్యా చ్‌ను డ్రా చేసిన శ్రీ లంక ఆటగాడు సోనాల్ దినుషాను ప్రత్యేకంగా అభినందించాడు. తొలి టెస్టులో భా రత్ ఘనవిజయం సాధించగా, రెండో టెస్టు డ్రాగా ముగిసింది. దీంతో రెండు మ్యాచ్‌ల సిరీస్‌ను భారత్ 1-0తో గెలుచుకుంది. ఈ సిరీస్ ఫలితం తర్వాత డబ్ల్యూటీసీ ఫైనల్ అవకాశాలను సంక్లిష్టంగా మార్చింది.కాగా కొలంబో టెస్టులో ఫాలో ఆన్ వ్యూహం బెడిసికొట్టిందన్న విమర్శలపై మాత్రం గంభీర్ నేరుగా స్పందించలేదు. టెస్టుల్లో పరిస్థితులకు తగ్గట్టు నిర్ణయాలు తీసుకుంటామని, ఒక్కోసారి




ఫలితాలు అనుకూలంగా రాకపోవచ్చంటూ వ్యాఖ్యానించాడు. హెడ్ కోచ్‌గా గంభీర్ వ్యూహాలపై మొదటి నుంచీ విమర్శ లు వస్తున్నాయి. ముఖ్యంగా స్వదేశంలో భారత జట్టు ఎదుర్కొన్న ఘోర పరాజయా లు గంభీర్ కోచింగ్ శైలిని ప్రశ్నార్థకం చేశాయి.గంభీర్ హయాంలోనే టీమిండియా స్వదేశంలో న్యూజిలాండ్ చేతిలో (0-3), దక్షిణాఫ్రికా చేతిలో (0-2) ఘోరమైన టెస్ట్ సిరీస్ ఓ టములను చవిచూసింది. ఒకే కోచ్ హ యాంలో స్వదేశంలో రెండు టెస్ట్ సిరీస్‌ల్లో వైట్‌వాష్ కావడం భారత క్రికెట్ చరిత్రలోనే ఇదే తొలిసారి. శ్రీలంకతో జరిగిన తాజా సిరీస్‌లో రెండో టెస్ట్ మ్యాచ్ ప్రతికూలంగా ముగిసినప్పుడు గంభీర్ ప్రెస్ కాన్ఫరెన్స్‌కు రాకుండా ముఖం చాటేశారని, కేవలం గెలిచినప్పుడు మాత్రమే ప్రగల్భాలు పలుకు తారని మాజీలు విమర్శలు గుప్పించారు.




# ఆసియా క్రీడలకు ద్వితీయ శ్రేణి జట్టు

**ముంబై :** ప్రతిష్టాత్మక ఆసియా క్రీడల కోసం కౌంట్ డౌన్ మొదలయింది. వచ్చే నెలలో జపాన్ వేదికగా ఈ క్రీడలు జరగనున్నాయి. అయితే ఈ క్రీడల కోసం క్రికెట్ జట్టును పంపించే విషయంలో బీసీసీఐ పునరాలోచనలో పడింది. ఈ టోర్నీకి ద్వితీయ శ్రేణి జట్టును పంపేందుకు బీసీసీఐ సిద్ధమైనట్లు సమాచారం.జపాన్‌లో సరైన క్రికెట్ మైదానాలు లేకపోవడం, వాష్ రూ మ్స్, డ్రెస్సింగ్ రూమ్స్ అధ్వానంగా ఉండడమే దీనికి కారణం. అయితే ఇప్పటికే ఈ టోర్నీలో ఆడే భారత జట్టును బీసీసీఐ ప్రకటించింది. శ్రేయస్ అయ్యర్ సారథ్యంలోని 15 మంది సభ్యులతో కూడిన జట్టుకు తిలక్ వర్మ వైస్ కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. జపాన్‌లోని ఐచి నగోయా క్రికెట్ మ్యాచ్‌లు ఆతిథ్యం ఇవ్వనుంది. అయితే అక్కడ సరైన ఏ ర్పాట్లు చేయలేదని తెలుస్తోంది. జపాన్‌లోని వసతులపై బీసీసీఐతో పాటు ఆసియా క్రికెట్ కౌన్సిల్ కూడా అసంతృప్తిగా ఉందని బో ర్డు వర్గాలు తెలిపాయి.బీసీసీఐతో పాటు ఆసియా క్రికెట్ కౌన్సిల్ సైతం జపాన్‌లోని సదుపాయాలపై అసంతృప్తిగా ఉన్నాయనీ, అందుకే అక్కడికి అబ్జర్వర్‌ను పంపించాలనుకుంటున్నాయనీ బోర్డు వర్గాలు తెలిపాయి.. అబ్జర్వర్ నివేదికను బట్టి జట్టు మార్పు విషయంలో బీసీసీఐ నిర్ణయం తీసుకుంటుం దనీ వెల్లడించాయి. బీసీసీఐతో పాటు పాకిస్థాన్ క్రికెట్ బోర్డు కూడా జపాన్‌లోని వసతులపై ఆందోళన వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. వాస్తవానికి ఐసీసీ రూల్స్ ప్రకారం.. ఒక మ్యాచ్‌ను కనీసం 2 వేల మంది ప్రేక్షకులు అయినా వీక్షించేలా స్టేడియం ఉండాలి. కానీ జపాన్‌లో అలాంటి పరిస్థితి లేద ని తెలుస్తోంది.

# చెంబడిపాలెం వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

- ఆగి ఉన్న కట్టెల లారీని వెనుక నుంచి ఢీకొట్టిన కేఎస్ఆర్టీసీ వోల్వో బస్సు
- డ్రైవర్‌తో పాటు 16 మంది ప్రయాణికులకు తీవ్ర గాయాలు.. ఇద్దరి పరిస్థితి విషమం
-క్షతగాత్రులను నాయుడుపేటకు తరలించి.. మెరుగైన చికిత్స కోసం నెల్లూరుకు తరలింపు






**పెళ్లకూరు -సూర్య వాస్తవం :**తిరుపతి జిల్లా పెళ్లకూరు మండలం తిరుపతి - నాయుడుపేట జాతీయ రహదారిపై చెంబడిపాలెం వద్ద శుక్రవారం తెల్లవారు జామున ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. రోడ్డుపక్కన మరమ్మతులకు గురై కట్టెల లోడుతో ఆగి ఉన్న లారీని కర్ణాటక రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థకు చెందిన వోల్వో బస్సు వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సు డ్రైవర్‌తో పాటు 16 మంది ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

### బెంగళూరు నుంచి నెల్లూరుకు వస్తుండగా ప్రమాదం

**పోలీసుల వివరాల మేరకు.. బెంగళూరు నుంచి 16 మంది ప్రయాణికులతో** నెల్లూరుకు బయలుదేరిన కర్ణాటక ఆర్టీసీ వోల్వో బస్సు చెంబడిపాలెం జాతీయ రహదారి వద్దకు చేరుకుంది. అదే సమయంలో కట్టెల లోడుతో ఉన్న లారీ మరమ్మతులకు గురై రోడ్డుకు ఒకవైపున నిలిపి ఉంచారు. బస్సు వేగంగా వస్తూ అదుపుతప్పి ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీకొనడంతో ఒక్కసారిగా భారీ శబ్దం చోటుచేసుకుంది.ఈ ప్రమాదంలో బస్సు ముందు భాగం తీవ్రంగా దెబ్బతినడంతో డ్రైవర్‌తో పాటు పలువురు ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాద తీవ్రతకు ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు.

### సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు

ప్రమాదంపై సమాచారం అందుకున్న వెంటనే పెళ్లకూరు ఎస్ఐ ఆదిలక్ష్మి పోలీసు సిబ్బందితో కలిసి హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రమాదంలో గాయపడిన వారిని బయటకు తీసి 108 అత్యవసర వాహనాల ద్వారా నాయుడుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.అక్కడ వైద్యులు క్షతగాత్రులకు ప్రాథమిక చికిత్స అందించారు. అయితే గాయపడిన వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం వారిని నెల్లూరులోని ఆసుపత్రులకు తరలించారు. మరికొందరికి నాయుడుపేట ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స కొనసాగుతోంది.

### చిన్నారుల కన్నీరుతో కంటతడి పెట్టించిన దృశ్యాలు

ఈ ప్రమాదంలో చిన్నారులు కూడా గాయపడిన వారితో ఉండటంతో ఆసుపత్రి వద్ద హృదయ విదారక పరిస్థితులు నెలకొన్నాయి. గాయాలపాలైన తల్లిదండ్రులను చూసి చిన్నారులు కన్నీటి పర్యంతమవడంతో అక్కడున్న వారి కళ్లలోనూ నీళ్లు తిరిగాయి. ప్రమాదం కారణంగా బాధిత కుటుంబాల్లో తీవ్ర ఆందోళన నెలకొంది.

### కేసు నమోదు.. దర్యాప్తు

ప్రమాదానికి గల కారణాలపై పోలీసులు విచారణ చేపట్టారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించి ప్రమాదానికి సంబంధించిన వివరాలను సేకరించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పెళ్లకూరు ఎస్ఐ ఆదిలక్ష్మి తెలిపారు.

# మేనకూరు సెజ్‌లో పరిశ్రమల జోరు..

- యువతకు ఉద్యోగాల హామీ!:ఎమ్మెల్యే డా. నెలవల విజయశ్రీ
-స్థానిక యువతకు పెద్దపీట వేసి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలి
- రూ.57 కోట్ల పెట్టుబడితో ఆక్టేవ్ ఫార్మాస్యూటికల్ సంస్థ ఏర్పాటు :ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ



**నాయుడుపేట -సూర్య వాస్తవం:**సూళ్లూరుపేట నియోజకవర్గంలో పారిశ్రామిక అభివృద్ధికి మరో ముందడుగు పడింది. ఓజిలి మండలం కారూరు గ్రామ పరిధిలో సుమారు రూ.57 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేసిన ఆక్టేవ్ ఫార్మాస్యూటికల్ పరిశ్రమ ప్రారంభం కావడం నియోజకవర్గానికి శుభపరిణామమని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ పేర్కొన్నారు. అలాగే ఓజిలి మండలం అత్తివరం గ్రామ పరిధిలోని మేనకూరు ప్రత్యేక ఆర్థిక మండలిలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆక్టమ్ లైఫ్ సైన్సెస్ సంస్థను కూడా లాంఛనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ మాట్లాడుతూ.. నియోజకవర్గంలో కొత్త పరిశ్రమలు ఏర్పాటవడం ద్వారా స్థానికంగా యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని అన్నారు. పరిశ్రమల స్థాపనతో ప్రాంతీయ ఆర్థికాభివృద్ధికి ఊతం లభించడంతో పాటు అనేక కుటుంబాలకు జీవనోపాధి లభించే అవకాశం ఉంటుందని తెలిపారు.

### దేశ, విదేశాలకు ఔషధాల ఎగుమతికి అవకాశం

మానవ వినియోగానికి అవసరమైన ఔషధాలను తయారు చేసి దేశంలోని వివిధ ప్రాంతాలతో పాటు విదేశాలకు కూడా ఎగుమతి చేసే స్థాయిలో పరిశ్రమను ఏర్పాటు చేయడం అభినందనీ యమన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన యంత్ర పరికరాలను పరిశ్రమలో ఏర్పాటు చేయడం వల్ల నాణ్యమైన ఔషధాల తయారీకి అవకాశం ఉంటుందని తెలిపారు.పరిశ్రమలోని వివిధ విభాగాలను ఎమ్మెల్యే పరిశీలించి, ఔషధాల తయారీకి వినియోగిస్తున్న ఆధునిక యంత్ర పరికరాల పనితీరును తెలుసు కున్నారు. ప్రభుత్వ నిబంధనలు, నిర్దేశిత నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా పరిశ్రమలో అవసరమైన సాంకేతిక పరికరాలను ఏర్పాటు చేసినట్లు యాజమాన్య ప్రతినిధులు వివరించారు.సెంట్రిఫ్యూజ్, ఎండబెట్టే ప్రక్రియ తదితర ఔషధ తయారీ ప్రక్రియలకు అవసరమైన యంత్ర పరికరాలు అందుబాటులో ఉండటంతో నాణ్యమైన ఉత్పత్తులను తయారు చేసే అవకాశం ఉందని తెలిపారు.

### స్థానిక యువతకే ఉద్యోగాల్లో ప్రాధాన్యత ఇవ్వాలి

నూతన పరిశ్రమ ద్వారా పెద్ద సంఖ్యలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉన్నందున స్థానిక యువతకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఎమ్మెల్యే పరిశ్రమ యాజమాన్యాన్ని కోరారు.ముఖ్యంగా యాజమాన్య ప్రతినిధులు సురేష్, రవి తదితరులు స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు కలిగిన స్థానిక యువతకు శిక్షణ అందించి వారికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తే ప్రాంతీయంగా ఎంతో ప్రయోజనం చేకూరుతుందని సూచించారు.

### పారిశ్రామిక కేంద్రంగా సూళ్లూరుపేట నియోజకవర్గం

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ రాష్ట్రానికి పెద్ద ఎత్తున పరిశ్రమలను తీసుకురావడానికి నిరంతరం కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే తెలిపారు. వారి కృషి, ప్రభుత్వ పారిశ్రామిక విధానాల కారణంగా సూళ్లూరుపేట నియోజకవర్గంలోని అత్తివరం, మేనకూరు, తడ, శ్రీసిటీ, మాంబట్టు తదితర ప్రాంతాలు పారిశ్రామిక కేంద్రాలుగా అభివృద్ధి చెందుతున్నాయని పేర్కొన్నారు.పరిశ్రమల స్థాపనకు అనుకూల వాతావరణాన్ని కల్పించడంతో పాటు స్థానిక ప్రజలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు అందేలా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు. నియోజకవర్గంలో పారిశ్రామిక అభివృద్ధి మరింత వేగవంతమైతే యువతకు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లాల్సిన అవసరం తగ్గుతుందని తెలిపారు.

### మరిన్ని పరిశ్రమలు తీసుకువచ్చేందుకు కృషి

రాబోయే రోజుల్లో సూళ్లూరుపేట నియోజకవర్గానికి మరిన్ని పరిశ్రమలను తీసుకువచ్చి స్థానికులకు విస్తృతంగా ఉద్యోగ అవకాశాలు కల్పించేలా కార్యాచరణ కొనసాగిస్తామని ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ తెలిపారు.పరిశ్రమల యాజమాన్యాలు కూడా స్థానిక ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఉద్యోగాల్లో స్థానికులకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. పరిశ్రమల అభివృద్ధి, స్థానిక యువతకు ఉపాధి కల్పన రెండూ సమాంతరంగా సాగినప్పుడే నిజమైన ప్రాంతీయ అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు.ఆక్టేవ్ ఫార్మాస్యూటికల్, ఆక్టమ్ లైఫ్ సైన్సెస్ సంస్థల యాజమాన్యాలకు ఎమ్మెల్యే హృదయపూర్వక అభినందనలు తెలిపారు. సంస్థలు భవిష్యత్తులో మరింత అభివృద్ధి చెంది సూళ్లూరుపేట నియోజకవర్గంతో పాటు రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.



# సేవా సంకల్పం...ప్రజా సంక్షేమమే లక్ష్యం!

-సేవా సంకల్ప అభియాన్ రాష్ట్ర జిల్లా కమిటీ నిర్వహించిన వర్క్ షాప్‌లో పాల్గొన్న మంత్రి సత్య కుమార్





**దొరవారిసత్రం- సూర్య వాస్తవం:**పుదుచ్చేరిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో 'సేవా సంకల్ప అభియాన్'లో భాగంగా నిర్వహించిన రాష్ట్ర, జిల్లా కమిటీ వర్క్‌షాప్‌లో మంత్రి శ్రీ సత్య కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 17 వరకు నిర్వహించనున్న ఈ కార్యక్రమం ద్వారా సేవా కార్యక్రమాలను ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లడం,సమాజంలోని ప్రతి వర్గానికి సేవలను చేరువ చేయడంపై వర్క్‌షాప్‌లో చర్చించారు.ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ సేవా సంకల్ప స్ఫూర్తితో,ప్రజాసేవను మరింత విస్తృతం చేస్తూ, దేశ ప్రగతి--ప్రజా సంక్షేమం కోసం కార్యకర్తలు సమర్థవంతంగా పనిచేసేలా కార్యాచరణ రూపొందిం చుకోవడంపై దిశానిర్దేశం చేశారు.

# భార్యను హత్య చేసిన భర్త అరెస్ట్



**దొరవారిసత్రం -సూర్య వాస్తవం :** సూళ్లూరుపేట మండల పరిధిలోని కోటపోలూరు అంబేద్కర్ నగర్ లో గత బుధవారం భార్యపై అనుమానంతో భర్త కిరాతకంగా చంపిన విషయం తెలిసిందే.ఈ సంఘటనలో ముద్దాయి పనబాక శ్రీనివాసులను శుక్రవారం అరెస్టు చేసి అదుపులోకి తీసుకున్నట్లు సీఐ మురళీకృష్ణ మీడియా సమావేశంలో వెల్లడించారు.శ్రీనివాసులుకు సంధ్య అనే మహిళ వివాహమై ఇద్దరు పిల్లలు.14 ఏళ్ళు కాపురం కొనసాగించారు.ఇటీవల వారి మధ్య కలహాలు రేగి,అనుమానం అనే పెనుభూతంతో శ్రీనివాసులు ప్రణాళిక ప్రకారం కోటపోలురు గ్రామ పొలాల సమీప వద్ద హత్య చేసి నిందితుడయ్యాడు. శుక్రవారం సిఐ మురళీకృష్ణ,ఎస్సై అజయ్ కుమార్ ముద్దాయిన అరెస్టు చేసి కోర్టుకు తరలించడం జరిగింది.

PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS ADDRESS : M. SULEMAN SAHEB H. No 158/56 UMA NAGAR, ANANTHAPURAM ANDHRA PRADESH - 515001. CELL : : 9885404140 ( ASSOCIATE EDITOR -Mohammad Shafi Ahamad 9948461699 )

# ఛాంపియన్‌షిప్ ముగింపు వేడుకల్లో
# డ్రగ్స్ వ్యతిరేక సమరభేరి

- --క్రీడాకారులతో కలిసి భారీ అవగాహన ర్యాలీ.
- క్రీడలు యువత ఉజ్వల భవిష్యత్తుకు బలమైన పునాది--డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి జిల్లా కలెక్టర్ డా.శ్రీ.వెంకటేశ్వర్లు,
- తిరుపతి జిల్లాలో గంజాయిపై ప్రత్యేక నిఘా -- 12,000 మందికి పరీక్షలు,430 మందికి పాజిటివ్: జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు,
- గంజాయి సేవించినా,విక్రయించినా,రవాణా చేసినా చట్టరీత్యా నేరమే --రిపీట్ అఫెండర్లపై పీడీ యాక్ట్ కింద కఠిన చర్యలు.
- "మీ శక్తిని డ్రగ్స్‌లో కాదు..చదువు..ఎదుగుదల.. క్రీడల్లో చూపించండి"యువతకు జిల్లా ఎస్పీ పిలుపు.






**దొరవారిసత్రం -సూర్య వాస్తవం:** తిరుపతి జిల్లాలో నిర్వహించిన అమరావతి ఛాంపియన్‌షిప్ రాష్ట్రస్థాయి క్రీడా పోటీల ముగింపు సందర్భంగా యువతను మాదకద్రవ్యాలకు దూరంగా ఉంచి,క్రీడల వైపు ప్రోత్సహించాలనే లక్ష్యంతో "డ్రగ్స్ వద్దు--క్రీడలు ముద్దు","డ్రగ్ ఫ్రీ ఆంధ్రప్రదేశ్" నినాదాలతో భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీ వెంకటేశ్వర్లు,జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు,పోలీసు,రెవెన్యూ అధికారులు,శాప్ ప్రతినిధులు,కోచ్‌లు,పీఈటీలు, పీడీలు,క్రీడాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్లు, మాట్లాడుతూ,ఈ నెల 24 నుంచి 27వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు అమరావతి ఛాంపియన్‌షిప్ రాష్ట్రస్థాయి క్రీడా పోటీలను విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు.అండర్-17,అండర్-23 కేటగిరీలలో 12 విభాగాల్లో నిర్వహించిన ఈ పోటీల్లో సుమారు 15,000 మంది క్రీడాకారులు,పీడీలు, పీఈటీలు,ఆఫీస్ బేరర్లు పాల్గొన్నారని గ్రామీణ ప్రతిభకు అమరావతి ఛాంపియన్‌షిప్ గొప్ప వేదిక అని తెలిపారు.క్రీడాకారులకు వసతి,భోజనం తదితర సౌకర్యాలను జిల్లా యంత్రాంగం,శాప్ సమన్వయంతో సజావుగా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.పాల్గొన్న వారిలో 65 శాతం మంది ప్రభుత్వ పాఠశాలలు,ప్రభుత్వ విద్యా సంస్థలకు చెందిన విద్యార్థులు,80 శాతానికి పైగా గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారు ఉండటం విశేషమన్నారు.గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభను గుర్తించి,వారికి సరైన ప్రోత్సాహం అందించి రాష్ట్ర,జాతీయ,అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లేందుకు అమరావతి ఛాంపియన్‌షిప్ ఒక గొప్ప వేదికగా నిలిచిందని కలెక్టర్ తెలిపారు.యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి క్రీడల వైపు మళ్లేలా పోలీసు శాఖ,శాప్ సహకారంతో డ్రగ్స్ వ్యతిరేక అవగాహన ర్యాలీ నిర్వహించామని తెలిపారు.క్రీడలు యువతలో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించి ఉజ్వల భవిష్యత్తుకు మార్గం చూపుతాయని పేర్కొన్నారు.అమరావతి ఛాంపియన్‌షిప్‌ను ఎటువంటి గాయాలు, వివాదాలు లేకుండా విజయవంతంగా నిర్వహించిన క్రీడాకారులు, అధికారులు, సిబ్బందిని కలెక్టర్ అభినందించారు.జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు, మాట్లాడుతూ, తిరుపతి పవిత్రమైన ఆధ్యాత్మిక నగరం కావడంతో ఇక్కడి నుంచి గంజాయి, మాదకద్రవ్యాలను పూర్తిగా నిర్మూలించేందుకు పోలీసు శాఖ అత్యంత ప్రాధాన్యతతో పనిచేస్తోందని స్పష్టం చేశారు.గంజాయి వినియోగంపై జిల్లాలో నిరంతర నిఘా,తనిఖీలు కొనసాగుతున్నాయని, ఇప్పటివరకు ప్రత్యేక ర్యాపిడ్ టెస్టింగ్ కిట్ల ద్వారా సుమారు 12,000 మందికి పరీక్షలు నిర్వహించగా, 430 మందికి గంజాయి పాజిటివ్‌గా నిర్ధారణ అయినట్లు తెలిపారు.పాజిటివ్‌గా తేలిన వారిలో 350 మందికి పైగా ఇతర రాష్ట్రాల నుంచి ఉపాధి కోసం వచ్చిన కార్మికులు ఉన్నట్లు గుర్తించామని తెలిపారు.వారికి అవగాహన,కౌన్సెలింగ్ నిర్వహించడంతో పాటు, గంజాయి సరఫరా మూలాలను గుర్తించేందుకు ప్రత్యేక దర్యాప్తు కొనసాగుతోందన్నారు. గంజాయి సరఫరా మూలాలపై ప్రత్యేక దృష్టి,గంజాయి కేసులను కేవలం వినియోగదారుల స్థాయిలోనే కాకుండా, సరఫరాదారులు,విక్రేతలు,రవాణాదారులు, కొనుగోలుదారుల మధ్య ఉన్న ఫార్వర్డ్, బ్యాక్‌వర్డ్ లింకేజీలను గుర్తించే విధంగా దర్యాప్తు చేస్తున్నామని జిల్లా ఎస్పీ తెలిపారు.ఇతర రాష్ట్రాల నుంచి రైళ్ల ద్వారా తిరుపతి, రేణిగుంట ప్రాంతాలకు గంజాయి చేరుతున్న మార్గాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని,ఇక్కడి నుంచి ఇతర రాష్ట్రాలకు గంజాయిని తరలించే ముఠాలను కూడా గుర్తించి అరెస్టులు చేస్తున్నామని తెలిపారు.రైళ్లలో అక్రమంగా తరలించే గంజాయిని గుర్తించేందుకు ప్రత్యేకంగా శిక్షణ పొందిన డాగ్ స్క్వాడ్‌ను వినియోగిస్తున్నామని ఎస్పీ వెల్లడించారు. గంజాయి సేవించినా..రవాణా చేసినా చట్టరీత్యా నేరమే,గంజాయిని సేవించడం, విక్రయించడం లేదా ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి అక్రమంగా రవాణా చేయడం చట్టరీత్యా తీవ్రమైన నేరమని ఎస్పీ స్పష్టం చేశారు.గంజాయి సంబంధిత నేరాలకు పదేపదే పాల్పడుతున్న రిపీట్, హ్యాబిచువల్ అఫెండర్లపై ప్రత్యేక నిఘా కొనసాగుతోందని,ఇప్పటివరకు సుమారు 275 గంజాయి షీట్లు ఓపెన్ చేసినట్లు తెలిపారు. మళ్లీ నేరాలకు పాల్పడే వారిపై పీడీ యాక్ట్ (పీడీ యాక్ట్) కింద కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

"మీ శక్తిని డ్రగ్స్‌లో కాదు..చదువు..ఎదుగుదల.. క్రీడల్లో చూపించండి"అనీ యువతకు ఎస్పీ పిలుపునీచ్చారు.మాదకద్రవ్యాలు ఒక్క వ్యక్తి జీవితాన్నే కాదు.మొత్తం కుటుంబ భవిష్యత్తును దెబ్బతీస్తాయని పేర్కొన్నారు.తాత్కాలిక ఆనందం కోసం డ్రగ్స్‌కు అలవాటు పడితే చదువు,ఉద్యోగం, ఆరోగ్యం,కుటుంబ సంబంధాలు,భవిష్యత్తు అన్నీ ప్రమాదంలో పడతాయని హెచ్చరించారు."మీ శక్తిని డ్రగ్స్‌లో కాదు..చదువులో చూపించండి. మీ ప్రతిభను చెడు అలవాట్లలో కాదు.. ఎదుగుదలలో చూపించండి.మీ సమయాన్ని మాదకద్రవ్యాలకు కాదు..క్రీడలకు,మీ లక్ష్య సాధనకు కేటాయించండి.ఈ రోజు మీరు ఎంచుకునే మార్గమే రేపటి మీ భవిష్యత్తును నిర్ణయిస్తుంది"అని యువతకు జిల్లా ఎస్పీ పిలుపునిచ్చారు.క్రీడాకారులు తమ ప్రతిభను సద్వినియోగం చేసుకుని రాష్ట్ర, జాతీయ,అంతర్జాతీయ స్థాయిలో రాణించి కుటుంబానికి,జిల్లాకు,రాష్ట్రానికి గర్వకారణంగా నిలవాలని జిల్లా ఎస్పీఆకాంక్షించారు.తిరుపతి జిల్లాను గంజాయి,డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు తల్లిదండ్రులు,ఉపాధ్యాయులు, యువత,ప్రజలు మరియు మీడియా ప్రతినిధులు పోలీసు శాఖకు సంపూర్ణ సహకారం అందించాలని జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు,కోరారు.క్రీడలతో ఆరోగ్యకరమైన సమాజం..అన్నారు మాదకద్రవ్యాలకు దూరంగా యువత..ఇదే డ్రగ్ ఫ్రీ సమాజానికి బలమైన పునాది"అని ఎస్పీ పేర్కొన్నారు.అమరావతి ఛాంపియన్ షిప్ ముగింపు సందర్భంగా క్రీడాకారులను భాగస్వామ్యం చేస్తూ డ్రగ్స్ వ్యతిరేకంగా భారీ అవగాహన ర్యాలీ నిర్వహించడం అభినందనీయమని ఎస్పీ తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన శాప్ ప్రతినిధులు,జిల్లా యంత్రాంగం,పోలీసు అధికారులు, ఈగల్ సిబ్బంది,కోచ్‌లు, క్రీడాకారులను అభినందించారు

## క్విజ్ పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందజేసిన"మంత్రి సత్య కుమార్"



**దొరవారిసత్రం- సూర్య వాస్తవం:**పుదుచ్చేరిలోని ఆచరియా బాలశిక్ష మందిర్ స్కూల్ లో దినమాలర్ స్టూడెంట్ ఎడిషన్ --పట్టం 'ఫ్లై హై ... షైన్ ఇన్ ది వరల్డ్ !'క్విజ్ కాంపిటీషన్ 2026--27 కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మంత్రి సత్య కుమార్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా క్విజ్ పోటీలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందజేసి అభినందించారు.విద్యార్థుల్లో జ్ఞానాన్ని పెంపొం దించడంతో పాటు,పోటీ స్ఫూర్తి, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేలా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని మంత్రి సత్య కుమార్ పేర్కొన్నారు.విద్యార్థులు తమ ప్రతిభను మరింతగా పెంపొంది ంచుకుని,ఉన్నత లక్ష్యాలను సాధించి దేశ ప్రగతిలో భాగస్వాములు కావాలని రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆకాంక్షించారు.

## ప్రభుత్వ వృత్తి విద్యా జూనియర్ కళాశాలలో ఓటరు నమోదు పై అవగాహన కార్యక్రమం




**దొరవారిసత్రం - సూర్య వాస్తవం:** కర్నూలు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి ఆదేశాల మేరకు ప్రభుత్వ వృత్తి విద్యా జూనియర్ కళాశాలలో ఓటరు నమోదు మరియు ఓటు హక్కు ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ధనుంజయ్, వీఆర్వో ప్రశాంత్ పాల్గొని విద్యార్థులకు ఓటరు నమోదు ప్రక్రియ,ఓటు హక్కు ప్రాధాన్యత, ప్రజాస్వామ్యంలో ఓటు విలువ తదితర అంశాలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ18 సంవత్సరాలు నిండిన ప్రతి విద్యార్థి, విద్యార్థిని తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమం కళాశాల ప్రిన్సిపాల్ మరియు ఎన్ఎస్ఎస్ పి.ఒ.డాక్టర్ ఎస్.నాగ స్వామి నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించబడింది.ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది విజయ శేఖర్, రామకృష్ణ, సోమేష్,ఉల్గోజి రావు,శారధి పటేల్, ఎంటియాజ్,శ్రీధర్ మూర్తి,బాలు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రతపై అవగాహనతో పాటు జిల్లా వ్యాప్తంగా విస్తృత వాహన తనిఖీలు

-ఎస్పీ శ్రీ ఎల్.సుబ్బరాయుడు,ఆదేశాలతో జిల్లా వ్యాప్తంగా విస్తృత తనిఖీలు.
- రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనలపై ప్రజలకు అవగాహన.
- హెల్మెట్,సీట్ బెల్ట్ వినియోగం తప్పనిసరి..డ్రంక్ అండ్ డ్రైవ్‌కు దూరంగా ఉండాలి.
- సైబర్ నేరాలు,గంజాయి,మత్తు పదార్థాల దుష్ప్రభావాలపై ప్రజలకు అవగాహన.





**దొరవారిసత్రం -సూర్య వాస్తవం:**తిరుపతి జిల్లా ఎస్పీ శ్రీ ల్.సుబ్బరాయుడు,ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా పోలీసులు శుక్రవారం విస్తృతంగా వాహన తనిఖీలు నిర్వహిస్తున్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ,ట్రాఫిక్ నిబంధనల అమలు,ప్రజల భద్రతే లక్ష్యంగా ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు.

ఈ సందర్భంగా వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్,సీట్ బెల్ట్ ధరించాలని,అతివేగం,నిర్లక్ష్యపు డ్రైవింగ్‌కు దూరంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు.ముఖ్యంగా మద్యం సేవించి వాహనం నడపడం వల్ల ప్రమాదాల తీవ్రత పెరిగే అవకాశం ఉన్నందున డ్రంక్ అండ్ డ్రైవ్‌కు పాల్పడవద్దని అవగాహన కల్పిస్తున్నారు. ఇందులో భాగంగా నాయుడుపేట పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నాయుడుపేట డీఎస్పీ ఆధ్వర్యంలో ఈ సాయంత్రం ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పాదచారులు, ద్విచక్ర వాహనదారులకు రోడ్డు భద్రతా జాగ్రత్తలు, హెల్మెట్ ప్రాధాన్యత,సీట్ బెల్ట్ వినియోగం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అలాగే సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, గుర్తుతెలియని లింకులు,ఫోన్ కాల్స్ ద్వారా వ్యక్తిగత లేదా బ్యాంకింగ్ వివరాలను ఎవరికీ వెల్లడించవద్దని సూచించారు. గంజాయి మరియు ఇతర మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలను వివరిస్తూ,ముఖ్యంగా యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని పోలీసులు సూచించారు. ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ జిల్లా వ్యాప్తంగా వాహన తనిఖీలు,ట్రాఫిక్ నియంత్రణ, రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తామని జిల్లా పోలీసు అధికారులు తెలిపారు.

## బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడంపై పోలీసుల ప్రత్యేక నిఘా

-జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు,ఆదేశాలతో జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక తనిఖీలు.
- ఓపెన్ బూజింగ్‌కు పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలు.
- ప్రజలకు ఇబ్బంది కలిగించే అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా.
- ప్రజా ప్రశాంతత, భద్రతకు భంగం కలిగిస్తే ఉపేక్షించేది లేదు.

**దొరవారిసత్రం -సూర్య వాస్తవం:** తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు, ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా పోలీసులు బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే (ఓపెన్ బూజింగ్) వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి తనిఖీలు నిర్వహిస్తున్నారు.ప్రజలకు ఇబ్బంది కలిగించే విధంగా రోడ్ల పక్కన,బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం,మద్యం సేవించి హంగామా చేయడం వంటి చర్యలను నియంత్రించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టారు.జిల్లాలోని పట్టణాలు,ప్రధాన రహదారులు,పార్కులు,బహిరంగ ప్రదేశాలు మరియు ప్రజలు అధికంగా సంచరించే ప్రాంతాల్లో పోలీసు అధికారులు,సిబ్బంది తనిఖీలు చేపడుతున్నారు.బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం వల్ల ప్రజలకు అసౌకర్యం కలగడంతో పాటు శాంతిభద్రతలకు విఘాతం కలిగే అవకాశం ఉన్నందున ఇటువంటి చర్యలకు పాల్పడవద్దని పోలీసులు సూచిస్తున్నారు.మద్యం సేవించి గొడవలు,అసభ్య ప్రవర్తన,ప్రజలకు ఇబ్బంది కలిగించడం లేదా ఇతర అసాంఘికకార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. ముఖ్యంగా మహిళలు,పిల్లలు మరియు సాధారణ ప్రజలు స్వేచ్ఛగా సంచరించేలా ప్రశాంతమైన వాతావరణాన్ని కల్పించడమే పోలీసుల ప్రధాన లక్ష్యమని తెలిపారు.అలాగే మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల తీవ్రమైన రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున డ్రంక్ అండ్ డ్రైవ్‌కు పాల్పడవద్దని వాహనదారులకు సూచించారు.మద్యం సేవించిన వారు వాహనాలు నడపకుండా ప్రత్యామ్నాయ రవాణా సౌకర్యాలను వినియోగించాలని పోలీసులు కోరారు.ప్రజా ప్రశాంతత,భద్రతకు భంగం కలిగించే ఎలాంటి చర్యలనూ తిరుపతి జిల్లా పోలీసులు ఉపేక్షించరు. జిల్లా వ్యాప్తంగా ఓపెన్ బూజింగ్,అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా,తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, స్పష్టం చేశారు.

